



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక ప్రశ్నించడం మన హక్కు







సంపుటి : 12 సంచిక : 227 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం బుధవారం 22 ఏప్రిల్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :12 ISSUE :227 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM WED 22 APRIL 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


## ఉపాధి హామీ పథకాన్ని కూటమి సర్కార్ నిర్వీర్యం చేస్తోంది

- గ్రామీణ ఆర్థిక వ్యవస్థను టీడీపీ ప్రభుత్వం దెబ్బతీస్తోందన్న జగన్
- గత రెండేళ్లుగా ఉపాధి హామీ పథకం అమలులో రాష్ట్రం వెనుకబాటులో ఉందని వెల్లడి
- ఉపాధి హామీ వ్యయం, పనిచేసిన కుటుంబాల సంఖ్య తగ్గాయని ఆరోపణ
- అవినీతిపై ఉన్న శ్రద్ధ ప్రజా సమస్యలపై లేదని విమర్శ

- మిగతా2లో



**పెన్ పవర్ డెస్క్:**టీడీపీ కూటమి ప్రభుత్వంపై వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు జీవనాధారమైన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని (ఎంజీఎన్ఆర్ఈజీఏ) ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని ఆయన ఆరోపించారు. దీనివల్ల రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల కొనుగోలు శక్తి తగ్గిపోయి, ఆర్థిక వ్యవస్థ కుంటుపడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఆదాయాన్ని పెంచడంలో ఉపాధి హామీ పథకం అత్యంత కీలకమని జగన్ పేర్కొన్నారు. చారిత్రకంగా ఈ పథకం అమలులో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రస్థానంలో ఉండేదని, కానీ గత రెండేళ్ల

- మిగతా2లో



## పిఠాపురంలో ఫ్లెక్సీ చిచ్చు.. వర్మ వర్సెస్ పెండెం దొరబాబు

- పిఠాపురంలో మరోసారి భగ్గుమన్న టీడీపీ-జనసేన వర్గపోరు
- ప్రభుత్వ కార్యక్రమ ఫ్లెక్సీలో సీఎం ఫొటో లేకపోవడంపై వివాదం
- టీడీపీ నేత వర్మ, జనసేన నేత దొరబాబు మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట
- క్రమశిక్షణ తప్పితే సహించేది లేదంటూ వర్మ ఘాటు హెచ్చరిక

**పెన్ పవర్ డెస్క్:**డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో మిత్రపక్షాలైన టీడీపీ, జనసేన మధ్య విభేదాలు మరోసారి భగ్గుమన్నాయి. ఓ ప్రభుత్వ కార్యక్రమ ఫ్లెక్సీలో ముఖ్యమంత్రి చంద్రబాబు

- మిగతా2లో

# అనకాపల్లిలో రూ.5,400 కోట్ల రీన్యూ సోలార్ ప్లాంట్...

## ఈ నెల 23న శంకుస్థాపన చేయనున్న సీఎం చంద్రబాబు

- అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో రీన్యూ భారీ సోలార్ ప్లాంట్
- రూ. 5,400 కోట్ల పెట్టుబడితో ఇంగోట్-వేఫర్ తయారీ కేంద్రం
- ఏప్రిల్ 23న శంకుస్థాపన చేయనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు
- ఈ ప్రాజెక్టు ద్వారా 2,100 మందికి పైగా ఉపాధి అవకాశాలు
- ఏపీలో మొత్తం రూ. 82,000 కోట్ల పెట్టుబడుల దిశగా రీన్యూ సంస్థ



**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక రంగంలో మరో భారీ పెట్టుబడికి రంగం సిద్ధమైంది. అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో సుమారు రూ. 5,400 కోట్ల వ్యయంతో సోలార్ ఇంగోట్-వేఫర్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రముఖ పునరుత్పాదక ఇంధన సంస్థ రీన్యూ ఎనర్జీ గ్లోబల్ (=వచీవఛ) ముందుకొచ్చింది. ఈ మెగా ప్రాజెక్టుకు ఏప్రిల్ 23న ముఖ్యమంత్రి చంద్రబాబు,

- మిగతా2లో

## గోర్ఖా సమస్యకు 6 నెలల్లో పరిష్కారం.. బీజేపీతోనే అది సాధ్యం

- దశాబ్దాల నాటి గోర్ఖా సమస్యకు పరిష్కారం చూపుతామన్న అమిత్ షా
- గోర్ఖా ప్రజల మనోభావాలను అర్థం చేసుకునే పార్టీ బీజేపీయేనని వ్యాఖ్య
- ఆరు నెలల్లోనే గోర్ఖాల ముఖంలో ఆనందాన్ని చూస్తారన్న అమిషా

- మిగతా2లో



## రేవంత్ రెడ్డి మొదటి నుంచి సీమాంధ్ర నేతల చేతుల్లో కీలుబొమ్మ

- 2015లో టీఆర్ఎస్ ప్రభుత్వాన్ని అస్థిరపరచాలనే కుట్రతో ఓటుకు నోటు కేసులో దొరికిపోయారని ఆరోపణ
- మేం పాలన మార్పు కోరుకుంటున్నాం కానీ రేవంత్ రెడ్డికి కీడు జరగాలని కోరుకోవడం లేదని వ్యాఖ్య
- కేసీఆర్ లేకుంటే ఆయన ముఖ్యమంత్రి అయ్యేవాడా అని ప్రశ్న

**పెన్ పవర్ డెస్క్:**తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆంధ్రా నాయకులకు తొత్తుగా మారిపోయారని నిన్న బీఆర్ఎస్ పార్టీలో చేరిన జగిత్యాల సీనియర్ నాయకుడు జీవన్ రెడ్డి విమర్శించారు. ఆయన మొదటి నుంచి

- మిగతా2లో





## ఇరాన్‌కు మరోసారి డొనాల్డ్ ట్రంప్ హెచ్చరిక

- కాల్పుల విరమణ పొడిగించడం ఇష్టంలేదన్న ట్రంప్
- ఇరాన్‌కు చర్చలు తప్ప మరో మార్గం లేదని వ్యాఖ్య
- విరామ సమయంలో అదనపు ఆయుధాలను సమకూర్చుకుంటామని వెల్లడి

**పెన్ పవర్ డెస్క్:**ఇరాన్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి హెచ్చరిక జారీ చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో కాల్పుల విరమణను పొడిగించడం తనకు ఏమాత్రం ఇష్టం లేదని స్పష్టం చేశారు. ఇరాన్‌కు చర్చలు తప్ప మరో మార్గం లేదని, ఒప్పందం కుదుర్చుకోవాల్సిందేనని తేల్చిచెప్పారు. చర్చల నేపథ్యంలో, ఈ విరామ సమయాన్ని వినియోగించుకుని

- మిగతా2లో



## చీకట్లో చంపడం, పగలు వెళ్లి పరామర్శించడం వైసీపీ నేతలకు అలవాటుగా మారింది

- పెద్ద దస్తగిరి హత్య వెనుక వైసీపీ అగ్రనేతల హస్తం ఉందన్న పార్థసారథి
- దస్తగిరి ఇంట్లో వందల కోట్ల విలువైన ఆస్తి పత్రాలు ఎలా దొరికాయని ప్రశ్న
- వైసీపీ అనుమతులపై కేంద్ర ఎన్నికల సంఘం పునరాలోచన చేయాలని డిమాండ్

**పెన్ పవర్ డెస్క్:**వైసీపీ కేవలం రాజకీయ పార్టీ కాదని, అది హత్యా రాజకీయాలకు అడ్డాగా మారిందని మంత్రి పార్థసారథి ధ్వజమెత్తారు. వైసీపీ కార్యకర్త పెద్ద దస్తగిరి హత్య వెనుక ఆ పార్టీ అగ్రనేతల హస్తం ఉందని మంత్రి ఆరోపించారు. చీకట్లో చంపడం, పగలు వెళ్లి పరామర్శించడం వైసీపీ

- మిగతా2లో

# ఎన్డీయేతోనే తమిళనాడుకు పూర్వ వైభవం



**పెన్ పవర్ డెస్క్:**అభివృద్ధి, సంక్షేమం, ఉద్యోగాల కల్పన జరగాలంటే అది ఒక్క ఎన్డీఏతోనే సాధ్యమని, తమిళనాడు రాష్ట్రానికి పూర్వవైభవం తీసుకురాగల శక్తి ఎన్డీఏ కూటమికి ఉందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. తమిళనాడు ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం నాడు చెన్నైలో

- తమిళనాడులో చంద్రబాబు ఎన్నికల ప్రచారం
- చెన్నైలో కేంద్రమంత్రి పీయూష్ గోయల్‌తో కలిసి మీడియా సమావేశం
- డీలిమిటేషన్‌పై డీఎంకే, కాంగ్రెస్ తీరును ఎండగట్టిన చంద్రబాబు
- మహిళా రిజర్వేషన్లను అడ్డుకుని దక్షిణాదికి నష్టం చేశారని ఆవేదన
- మాతృభాషను గౌరవిద్దాం.. ఇతర భాషలపై ద్వేషం వద్దని హితవు

కేంద్రమంత్రి పీయూష్ గోయల్‌తో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా డీఎంకే, కాంగ్రెస్ పార్టీల వైఖరిపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. తమి ళనాడు ప్రస్తుత రాజకీయ పరిస్థితుల వల్ల రాష్ట్రం ఎలా నష్టపోతుందో వివరించారు.

**రాహుల్, స్టాలిన్ దీని ద్వారా ఏం సాధించారు?**

మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్ బిల్లుల విషయంలో డీఎంకే, కాంగ్రెస్ పార్టీలు దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం చేశాయని చంద్రబాబు ఆరోపించారు. "మహిళా రిజర్వేషన్ బిల్లుపై కేంద్రాన్ని ఓడించామని డీఎంకే, కాంగ్రెస్, టీఎంసీ, ఎస్పీ వంటి పార్టీలు భావిస్తున్నాయి. కానీ వాస్తవానికి వారు ఈ దేశ మహిళలను, దక్షిణాది రాష్ట్రాలను ఓడించారు. జనాభాతో

- మిగతా2లో



## తమిళనాడులో ఊహించని ఫలితాలు వస్తాయి

- కూటముల లెక్కలు, పార్టీల అంచనాలు తారుమారవుతాయన్న విజయ్
- విజిల్ సత్తా ఏమిటో ఫలితాలు చెబుతాయన్న విజయ్
- డీఎంకేను ఇంటికి పంపించేందుకు ఇదే చివరి ప్రచారమన్న విజయ్

**పెన్ పవర్ డెస్క్:**తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ఊహించని ఫలితాలు వస్తాయని, కూటముల లెక్కలు, పార్టీల అంచనాలు ఈ ఎన్నికల్లో తారుమారవుతాయని ప్రముఖ సినీ నటుడు, టీవీకే అధ్యక్షుడు విజయ్ అన్నారు. ఎన్నికల ప్రచారం చివరి రోజు

- మిగతా2లో

## కేరళలో ఘోర విషాదం... బాణసంచా పరిశ్రమలో పేలుడు, 13 మంది మృతి

- త్రిస్సూర్ పూరం వేడుకల్లో భారీ పేలుడు
- ఘటనలో 13 మంది మృతి, పలువురికి తీవ్ర గాయాలు
- బాణసంచా తయారీ కేంద్రంలో అగ్నిప్రమాదం
- అప్రమత్తమైన కేరళ ప్రభుత్వం, సహాయక చర్యలు ముమ్మరం
- ఘటనపై విచారణకు ఆదేశించిన అధికారులు

**పెన్ పవర్ డెస్క్:**కేరళలోని ప్రసిద్ధ త్రిస్సూర్ పూరం వేడుకల్లో ఘోర విషాదం చోటుచేసుకుంది. బాణసంచా తయారీ కేంద్రంలో సోమవారం జరిగిన భారీ పేలుడులో 13 మంది ప్రాణాలు కోల్పోగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. భారతదేశంలోనే అత్యంత ప్రసిద్ధి చెందిన ఆలయ ఉత్సవాల్లో ఒకటైన త్రిస్సూర్ పూరం కోసం బాణసంచా సిద్ధం చేస్తుండగా ఈ దుర్ఘటన జరిగింది. పేలుడు ధాటికి భారీగా మంటలు ఎగసిపడి, ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ అలుముకోవడంతో కార్మికులు, స్థానికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ప్రతి ఏటా మలయాళ నెల 'మాదం'లో పూరం నక్షత్రం రోజున త్రిస్సూర్‌లోని వడక్కునాథన్ ఆలయంలో ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తారు. ఆసియాలోనే అతిపెద్ద పండుగల్లో ఒకటిగా గుర్తింపు పొందిన ఈ వేడుకకు పది లక్షలకు పైగా భక్తులు హాజరవుతారు. ఈ ఉత్సవాల్లో బాణసంచా ప్రదర్శన

- మిగతా2లో



## ఎడిటర్ వ్యూ

# ఆకాశవాణి తొలి స్వరకర్త బాలాంత్రపు రజనీ కాంతరావు

సుప్రసిద్ధ వాగ్గేయకారునిగా, స్వరకర్తగా, గీత రచయితగా, విజయవాడలోని ఆకాశవాణి సంచాలకులుగా రేడియో శ్రోతలకు చిరపరిచితులు. అయనతొలితరం సంగీత దర్శకుల్లో ఒకరు. ఆయన రచించిన వాగ్గేయకార చరిత్ర 20వ శతాబ్దంలో తెలుగులో వచ్చిన గొప్ప పుస్తకాల్లో ఒకటి. 1947 లో దేశం స్వాతంత్ర్యం పొందిన అర్థరాత్రి భారత ప్రధాని సుప్రసిద్ధ ప్రసంగం పూర్తవగానే రజనీ రచించి, స్వరపరచిన 'మాదీ స్వతంత్రదేశం, మాదీ స్వతంత్ర జాతి' టంగుటూరి సూర్యకుమారి గానం ఆసేతుహిమాచలం ప్రతిధ్వనించింది.

తొలి స్వాంత్ర్య దినోత్సవం రోజున స్వయంగా రచించి స్వరపర్చిన "జయభేరి, వాయించు నగారా గీతం" మద్రాసు ఆకాశవాణి కేంద్రం నుంచి ప్రసారమయ్యాయి. ఆ తర్వాత అర్థశతాబ్దం పైగా ఆయన తెలుగునాట లలిత సంగీతమనే ఒక నూతన గాన సంప్రదాయాన్ని సృష్టించి, పెంపొందించి, తానొక వాగ్గేయ కారుడిగా అవతరించడమే కాక, మరెందరో వాగ్గేయకారులకు మార్గదర్శకులుగా ఉన్నారు.

1920 జనవరి 29న పశ్చిమ గోదావరి జిల్లా నిడదోలులో రజనీకాంత రావు జన్మించారు. ఆయన తండ్రి బాలాంత్రపు వేంకటరావు ప్రసిద్ధి చెందిన వేంకట పార్వతీశ కవుల్లో ఒకరు కావడం విశేషం. 1940-41 ప్రాంతంలో ఇరవయ్యేళ్ల నాడు ఆల్ ఇండియా రేడియో సంస్థలో ఉద్యోగంలో చేరగా, నాటి నుండి రిటైరయ్యే వరకూ దేశంలోని వివిధ ప్రాంతాల్లోని కేంద్రాల్లో పనిచేసి 1978లో రేడియో స్టేషన్ డైరెక్టరుగా రిటైరయ్యారు.ఆకాశవాణిలో తొలి స్వరకర్తగా శ్రోతలను అలరించారు. విజయవాడ ఆకాశవాణి కేంద్రానికి జాతీయస్థాయి గుర్తింపు తెచ్చిన వారిలో రజనీకాంతరావు కీలకమైన వారు. అలాగే తొలితరం సంగీత దర్శకుల్లోనూ బాలాంత్రపు కూడా ఒకరు.

రజనీ" అని పిలుచుకునే బాలాంత్రపు రజనీ కాంతరావు ఒక వ్యక్తి కాదు, ఆయన ఏదో ఒక కళకే పరిమితం కాదు. ఆయన ఒక రచయిత, వాగ్గేయ కారుడు, రేడియో కళాకారుడు, సినీ పాటల - మాటల రచయిత, సంగీత దర్శకుడు. సంగీతంలో , సాహిత్యంలో, ముఖ్యంగా కవిత్వంలో రజనీది ఒక ప్రత్యేక శైలి. సాధారణత్వం - సంక్లిష్టత, ప్రాచీనత - ఆధునికత, అచ్చ తెలుగు మాటలు - సంస్కృత భూయిష్ట సమాసాలు, అనేక పరస్పర విరుద్ద విషయాలు అయన కవిత్వంలో పదబంధాల్లో చోటు చేసుకున్నాయి.ప్రయోగాలు - సంగీత రూపకాలు, యక్షగానాలు, నాటికలు, సంగీత శిక్షణ, ఉషశ్రీ గారి ధర్మ సందేహాలు, ఈ మాసపు పాట, బావగారి కబుర్లు, ఇంకా ఎన్నో కార్యక్రమాల రూపకర్త ఆయన. వీటికి సంబంధించిన రచనలు చేయడం, బాణీలు సమకూర్చడం ఒక ఎత్తు, వాటిని గాయనీ గాయకులతో, వాద్య బృందంతో నిర్వహించడం మరొక ఎత్తు, రేడియో కోసం రచయిత గుడిపాటి వెంకటాచలంను అయన చేసిన ఇంటర్వ్యూ ఈ నాటికి కూడా అపురూపమైనదిగా పరిగణిస్తారు. ఆలిండియా రేడియో లలిత సంగీత విభాగాన్ని తన ప్రతిభతో సుసంపన్నం చేశారు. రజనీ రచించి, స్వరపరిచిన అనేక కృతులు తెలుగు వారి సాంస్కృతిక, సంగీత రంగాల్లో నిలిచి పోయాయి. ప్రఖ్యాత కర్ణాటక సంగీత విద్వాంసుడు మంగళంపల్లి బాలమురళీకృష్ణ తన సంగీతంలో లిరిసిజం రజనీ ప్రభావమేనన్నారు. లలిత సంగీతానికి, తెలుగు సాహిత్యానికి మధ్య సంబంధాన్ని నెలకొల్పి, దానికి రూపకల్పన చేసిన గొప్ప సంగీత కారులుగా ఘంటసాల వెంకటేశ్వరరావు, సాలూరి రాజేశ్వరరావులతో పాటు రజనీకాంతరావు తెలుగు సంగీత చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తారు.ఠాగూర్ అకాడమీ రత్న - రవీంద్రనాథ్ ఠాగూర్ 150 జయంతి సందర్భంగా సంగీత నాటక అకాడమీ ప్రదానం, కళాప్రపూర్ణ - ఆంధ్ర విశ్వ విద్యాలయం 1981 లో బహుకరించిన గౌరవ డాక్టరేట్,

కళారత్న అవార్డు - ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2007 లో ఇచ్చిన పురస్కారం, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం - 1961. ఆంధ్ర వాగ్గేయకారుల చరిత్ర ఉత్తమ పరిశోధనా గ్రంథానికి ,ప్రతిభా మూర్తి జీవితకాల సాఫల్య బహుమతి - అమెరికాలోని అప్పజోస్యుల విష్ణుభొట్ల ఫౌండేషన్ వారి పురస్కారం, నాథ సుధార్ణవ - మదరాసు మురళీరవళి ఆర్ట్ అకాడమీ, పుంభావ సరస్వతి,

నవీన వాగ్గేయకార, 2008లో తెలుగు విశ్వ విద్యాలయం నుండి సాంస్కృతిక రంగంలో విశిష్ట పురస్కారాలు ఆయనకు లభించాయి. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ, రజనీకాంతరావు 2018, ఏప్రిల్ 22 ఆదివారం రోజున మరణించాడు

# అనకాపల్లిలో రూ.5,400 కోట్ల రీన్యూ సోలార్ ప్లాంట్...

- మొదటి పేజి తరువాయి

రీన్యూ సీఈఓ సుమంత్ సిన్హాతో కలిసి శంకుస్థాపన చేయనున్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా రూ. 4,200 కోట్లతో 6 గిగావాట్ల సామర్థ్యం కలిగిన సోలార్ ఇంగోట్-వేఫర్ తయారీ ప్లాంట్‌ను, మరో రూ. 1,200 కోట్లతో 125 మెగావాట్ల హైబ్రిడ్ క్యాప్టివ్ పవర్ ప్లాంట్‌ను రీన్యూ నిర్మించనుంది. కేవలం 24 నెలల రికార్డు సమయంలోనే ఈ ప్లాంట్‌లో కార్యకలాపాలు ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 2,100 మందికి పైగా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.సోలార్ పీవీ మాడ్యూల్స్, సెల్స్ తయారీకి అత్యంత కీలకమైన ఇంగోట్స్, వేఫర్లను దేశీయంగా ఉత్పత్తి చేయడం ద్వారా సోలార్ సరఫరా రంగంలో స్వయం సమృద్ధి సాధించేందుకు ఈ ప్లాంట్ దోహదపడనుంది. 2015 నుంచి రాష్ట్రంలో కార్యకలాపాలు సాగిస్తున్న రీన్యూ, ఇప్పటికే అనంతపురం జిల్లాలో రూ. 22,000 కోట్లతో దేశంలోనే

అతిపెద్ద హైబ్రిడ్ రెన్యూవబుల్ ఎనర్జీ కాంప్లెక్స్‌ను నిర్మిస్తోంది. తాజా ప్రాజెక్టుతో కలిపి రాష్ట్రంలో మొత్తం రూ. 82,000 కోట్ల పెట్టుబడుల దిశగా రీన్యూ అడుగులు వేస్తోంది. ఈ ప్రాజెక్టుతో అనకాపల్లి పారిశ్రామిక ముఖచిత్రం మారనుందని నిపుణులు భావిస్తున్నారు.

# గోర్ఖా సమస్యకు 6 నెలల్లో పరిష్కారం.. బీజేపీతోనే అది సాధ్యం

పశ్చిమ బెంగాల్‌లోని కుర్సియాంగ్‌లో జరిగిన ఎన్నికల సభలో కేంద్ర మంత్రి అమిత్ షా ప్రసంగిస్తూ... గోర్ఖా వర్గ ప్రజలకు భారీ భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే దశాబ్దాల కాలం నాటి గోర్ఖా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని ఆయన స్పష్టం చేశారు.గోర్ఖా ప్రజల మనోభావాలను, వారి ఆందోళనలను అర్థం చేసుకోగల ఏకైక పార్టీ బీజేపీయేనని, మరే ఇతర పార్టీ కూడా ఈ సమస్యను పరిష్కరించలేదని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఏర్పడిన

ఆరు నెలల్లోనే గోర్ఖాల ముఖంలో ఆనందాన్ని చూస్తారని... వారు శాంతియుతంగా జీవించేలా పరిష్కారాన్ని గుర్తిస్తామని హామీ ఇచ్చారు.

అయితే, తన ప్రసంగంలో అమిత్ షా ఎక్కడా నేరుగా 'గోర్ఖాల్యాండ్' లేదా 'ప్రత్యేక రాష్ట్రం' అనే పదాలను వాడకపోవడం గమనార్హం. కేవలం 'సమస్య పరిష్కారం' అనే అంశంపైనే ఆయన దృష్టి సారించారు.

# ఇరాన్‌కు మరోసారి డొనాల్డ్ ట్రంప్ హెచ్చరిక

- మొదటి పేజి తరువాయి

అమెరికా సైన్యం అదనపు ఆయుధ సామాగ్రిని సమకూర్చుకుంటుందని ఆయన తెలిపారు. ఇరాన్‌పై దాడులు తిరిగి ప్రారంభించేందుకు తమ సైన్యం సిద్ధంగా ఉందని, తాను ఆదేశిస్తే అదే జరుగుతుందని హెచ్చరించారు. తదుపరి చర్చల్లో పురోగతి కనిపిస్తే కాల్పుల విరమణను కొనసాగిస్తారా అని మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా, కాల్పుల విరమణ కొనసాగించాలనుకోవడం లేదని అన్నారు. తమకు అంత సమయం కూడా లేదని తెలిపారు. కాగా, కాల్పుల విరమణ నేడో, రేపో ముగియనుంది.

# తమిళనాడులో ఊహించని ఫలితాలు వస్తాయి

- మొదటి పేజి తరువాయి

ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. విజిల్ సత్తా ఏమిటో ఫలితాలు చెబుతాయని అన్నారు. ఎన్నికల్లో ఒకప్పటి పరిస్థితులు ఇప్పుడు లేవని అన్నారు. తరం మారిందని, సంప్రదాయ ఓటింగ్ లెక్కలు ఇప్పుడు చిత్తు కానున్నాయని జోస్యం చెప్పారు.డీఎంకేను ఇంటికి పంపించేందుకు ఇదే చివరి ప్రచారమని, స్టాలిన్ సర్ ఇంటికే పరిమితమవుతారని జోస్యం చెప్పారు. బీజేపీకి చెందిన ఒక మంత్రి తనను నటుడు అంటున్నారని, నేను నటుడిని అన్న మాట వాస్తవమేనని, కానీ రాజకీయాల్లో మాత్రం నటుడిని కాదని అన్నారు. కానీ వీరు రాజకీయాల్లో నటులు అని విమర్శించారు. కేంద్రంలో అధికారంలో ఉన్నామని చెప్పి బీజేపీ నాయకులు నాటకాలు ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తనను ఒక్కడిని ఓడించడం కోసం అందరూ ఏకమయ్యారని వ్యాఖ్యానించారు.

# ఉపాధి హామీ పథకాన్ని కూటమి సర్కార్ నిర్వీర్యం చేస్తోంది

- మొదటి పేజి తరువాయి

టీడీపీ కూటమి పాలనలో రాష్ట్రం వెనుకబడిపోయిందని విమర్శించారు. ఆమోదించిన లేబర్ బడ్జెట్, పథకం కింద పనిచేసిన కుటుంబాల సంఖ్య, మొత్తం వ్యయం వంటి అన్ని కొలమానాల్లోనూ పనితీరు గణనీయంగా తగ్గిపోయిందని ఆయన వివరించారు.ఈ ప్రభావం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై స్పష్టంగా కనిపిస్తోందని జగన్ తెలిపారు. గత రెండేళ్లుగా జీఎస్టీ, అమ్మకం పన్ను వసూళ్లు మందగించడమే ఇందుకు నిదర్శనమని అన్నారు. "టీడీపీ కూటమి ప్రభుత్వం అవినీతి, సంపదపై ఉన్న యావతోనే నిమగ్నమై ఉంది. రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి పెట్టే సమయం వారికి లేదు" అని జగన్ వ్యాఖ్యానించారు. ప్రభుత్వం తన ప్రాధాన్యతలను మార్చుకొని, ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని ఆయన డిమాండ్ చేశారు.

## పిఠాపురంలో ఫ్లెక్సీ చిచ్చు.. వర్మ వర్సెస్ పెండెం దొరబాబు

- మొదటి పేజి తరువాయి

ఫొటో లేకపోవడం తీవ్ర వివాదానికి, తోపులాటకు దారితీసింది. మంగళవారం పిఠాపురంలో ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన (పీఎంజేఏవై) కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో సీఎం చంద్రబాబు ఫొటో లేకపోవడాన్ని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్వీఎస్ఎన్ వర్మ గమనించి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రభుత్వ అధికారిక కార్యక్రమంలో సీఎం ఫొటో పెట్టకపోవడం ప్రోటోకాల్ ఉల్లంఘనేనని ఆయన జనసేన నాయకులను, అధికారులను నిలదీశారు.ఈ క్రమంలో జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మలబాబుతో వర్మకు వాగ్వాదం జరిగింది. ఇంతలో మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు కల్పించుకుని వర్మపైకి దూసుకెళ్లడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఇరువర్గాల కార్యకర్తలు ఒకరినొకరు నెట్టుకోవడంతో తీవ్ర గందరగోళం నెలకొంది. వెంటనే పోలీసులు రంగప్రవేశం చేసి ఇరువర్గాలను శాంతింపజేశారు.అనంతరం వర్మ మాట్లాడుతూ, దొరబాబు తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "జనసేన, టీడీపీ ఒకే కుటుంబం. కానీ, వైసీపీ నుంచి వచ్చిన వారు ఇక్కడ పెత్తనం చెలాయిస్తే ఎలా? క్రమశిక్షణ తప్పితే తోలు తీస్తా" అంటూ ఘాటుగా హెచ్చరించారు. పవన్ కల్యాణ్ గెలుపు కోసం తామంతా

కష్టపడితే, గెలిపించిన టీడీపీ నాయకులపైనే దాడులు చేస్తారా? అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రికి అవమానం జరిగితే సహించే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ ఘటన పిఠాపురంలో కూటమి పార్టీల మధ్య సమన్వయ లోపాన్ని మరోసారి బహిర్గతం చేసింది.

# రేవంత్ రెడ్డి మొదటి నుంచి సీమాంధ్ర నేతల చేతుల్లో కీలుబొమ్మ

- మొదటి పేజి తరువాయి

సీమాంధ్ర నాయకుల చేతిలో కీలుబొమ్మగానే ఉంటున్నారని అన్నారు. 2015లో నాటి టీఆర్ఎస్ ప్రభుత్వాన్ని అస్థిరపరచాలనే కుట్రతో, వేం నరేందర్ రెడ్డిని ఎమ్మెల్సీగా చేయాలనే ఉద్దేశంతో ఓటుకు నోటు కేసులో రేవంత్ రెడ్డి దొరికిపోయారని పేర్కొన్నారు. ఆయనకు రాజ్యాంగం పట్ల గౌరవం లేదని విమర్శించారు. ఆయన ఆంధ్రా తొత్తులా మారి పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి సహకరిస్తున్నారని ఆరోపించారు.రేవంత్ రెడ్డి పాలన పోయి కేసీఆర్ పాలన రావాలని తెలంగాణ ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. మేం పాలన మార్పు కోరుకున్నాం తప్ప, భౌతికంగా రేవంత్ రెడ్డి కీడును తాము కోరుకోలేదని అన్నారు. రేవంత్ రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రి అయ్యారంటే అది కేసీఆర్ పుణ్యమే అన్నారు. కేసీఆర్ ఉద్యమించకుంటే తెలంగాణ వచ్చేదా అని ప్రశ్నించారు. అలాంటి ఉద్యమనాయకుడిని పట్టుకుని ఉరితీస్తానని అంటావా అని ప్రశ్నించారు.జగిత్యాలలో కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ సమయంలోనే రేవంత్ రెడ్డి కావాలని మేడిగడ్డ పర్యటనను పెట్టుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీలో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియదని, కానీ రేవంత్ రెడ్డి తానే ఎప్పటికీ ముఖ్యమంత్రిగా ఉంటానని చెబుతున్నాడని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం అన్నీ గమనిస్తోందని తెలిపారు. రేవంత్ రెడ్డి ఇప్పటికే బీజేపీలో చేరారని... ఎన్డీఏకు, రేవంత్ రెడ్డికి మధ్య చంద్రబాబు వారధిగా ఉన్నారని అన్నారు. తనను చంద్రబాబు కాపాడుతారని ఆయన భావిస్తున్నారని వ్యాఖ్యానించారు. ఇంత జరుగుతున్నా కాంగ్రెస్ అధిష్ఠానం ఎందుకు మౌనంగా ఉందో అర్థం కావడంలేదని అన్నారు.

నాదెండ్ల భాస్కరరావు అంశం గురించి రేవంత్ రెడ్డి తెలియకుండా మాట్లాడుతున్నారని జీవన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆనాడు నాదెండ్ల భాస్కరరావుకు కాంగ్రెస్ పార్టీ మద్దతుగా నిలిచిందని గుర్తు చేశారు. ఆయనకు మద్దతుగా తాను మంత్రి పదవికి రాజీనామా చేశానని వెల్లడించారు. తనను ఎవరూ తొలగించలేదని, తనంతట తానే రాజీనామా చేశానని అన్నారు. తనతో పాటు ఇందిరాగాంధీ, కాంగ్రెస్ సహా అందరూ నాదెండ్లకు మద్దతుగా నిలిచారని వెల్లడించారు. ఈ విషయం రేవంత్ రెడ్డికి తెలియదేమో అని విమర్శించారు.

# చీకట్లో చంపడం, పగలు వెళ్లి పరామర్శించడం వైసీపీ నేతలకు అలవాటుగా మారింది

- మొదటి పేజి తరువాయి

నేతలకు అలవాటుగా మారిందని అన్నారు.హత్యకు గురైన పెద్ద దస్తగిరి ఇంట్లో జగన్ మేనమామ, మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి కుటుంబ సభ్యుల పేరు మీద ఉన్న వందల కోట్ల విలువైన ఆస్తి పత్రాలు ఎలా దొరికాయని ఆయన ప్రశ్నించారు. దస్తగిరి కడప ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డికి, రవీంద్రనాథ్ రెడ్డికి అత్యంత సన్నిహితుడని, ఆస్తుల గొడవల నేపథ్యంలోనే ఈ హత్య జరిగిందని మంత్రి అనుమానం వ్యక్తం చేశారు. పెద్ద దస్తగిరి హత్యకు కారకులైన నేతలు ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నారని మండిపడ్డారు.

వైఎస్ వివేకానందరెడ్డి హత్య నుంచి పెద్ద దస్తగిరి హత్య వరకు వైసీపీ ఒకే తరహా నాటకాలు ఆడుతోందని, అధికారం

కోసం ఆ పార్టీ నేతలు ఎంతకైనా దిగజారుతారని విమర్శించారు. వైసీపీకి రాజకీయాల్లో కొనసాగే అర్హత లేదని అన్నారు. జగన్ అండ్ కో పాపాలను ప్రజలు క్షమించరని వ్యాఖ్యానించారు. ఆ పార్టీ అనుమతులపై కేంద్ర ఎన్నికల సంఘం పునరాలోచన చేయాలని డిమాండ్ చేశారు.

## కేరళలో ఘోర విషాదం... బాణసంచా పరిశ్రమలో పేలుడు, 13 మంది మృతి

- మొదటి పేజి తరువాయి

చాలా ప్రత్యేకం. దీనికోసం సిద్ధం చేస్తున్న షెడ్‌లోనే ప్రమాదం సంభవించింది.ఈ ఘటనపై కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సహాయక చర్యల కోసం ప్రభుత్వ యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించినట్లు తెలిపారు. అవసరమైతే ఇతర రాష్ట్రాల నుంచి నిపుణులైన వైద్యులను రప్పిస్తామని ఆయన అన్నారు. పోలీస్, ఫైర్, ఆరోగ్య, రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖల సమన్వయంతో సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.ప్రస్తుతం త్రిస్సూర్ మెడికల్ కాలేజీలో 13 మంది చికిత్స పొందుతున్నారని, వీరిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉందని అధికారులు వెల్లడించారు. బాణసంచా నిల్వ, నిర్వహణలో భద్రతా లోపాలపై అధికారులు విచారణ ప్రారంభించారు. ఈ విషాద ఘటనతో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఈ ఉత్సవాలపై విషాద ఛాయలు అలుముకున్నాయి.

## ఎన్డీయేతోనే తమిళనాడుకు పూర్వ వైభవం

- మొదటి పేజి తరువాయి

సంబంధం లేకుండా ప్రస్తుతం ఉన్న సీట్లకు అదనంగా 50 శాతం పెంచాలనేది కేంద్రం ప్రతిపాదన. ఆ పెరిగిన సీట్లలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు వస్తాయి. దీనివల్ల దక్షిణాదికి ఎలాంటి నష్టం లేదు. ఈ ఫార్ములా కంటే మెరుగైనది మరొకటి ఉంటుందా? అయినా, కేవలం రాజకీయ కారణాలతో ఈ రెండు బిల్లులను అడ్డుకున్నారు. రాహుల్ గాంధీ, స్టాలిన్ దీని ద్వారా ఏం సాధించారు?" అని చంద్రబాబు ప్రశ్నించారు.

"సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న నేను దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరిగేలా ఎందుకు ఆలోచిస్తాను? నేను దక్షిణాది వైపే మాట్లాడుతున్నాను. 2001లో వాజ్‌పేయి హయాంలో జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ ప్రతిపాదన వస్తే, అది దక్షిణాదికి నష్టమని చెప్పి నేనే ఆపించాను. ఈ విషయాన్ని ఇండియా కూటమి పార్టీలు గుర్తుంచుకోవాలి" అని ఆయన స్పష్టం చేశారు.

**తమిళనాడుకు గత వైభవమేదీ?**

ఒకప్పుడు దక్షిణ భారతదేశానికే కేంద్రంగా ఉన్న చెన్నై, ఇప్పుడు హైదరాబాద్, బెంగళూరు వంటి నగరాలతో పోటీ పడలేకపోతోందని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. "తమిళనాడులో అభివృద్ధి ఆగిపోయింది. శాంతిభద్రతలు క్షీణించాయి. మహిళలపై నేరాలు, కస్టోడియల్ మరణాలు, డ్రగ్స్ వాడకం పెరిగిపోయాయి. గతంలో తమిళనాడుకు గొప్ప చరిత్ర ఉండేది. కానీ ఇప్పుడా పరిస్థితి ఉందా? జరిగిన కొద్దిపాటి అభివృద్ధి కూడా కేంద్ర నిధుల వల్లే. చెన్నై రైల్వే స్టేషన్ ఆధునికీకరణ, చెన్నై-బెంగళూరు-అమరావతి హైస్పీడ్ రైలు కారిడార్ వంటివి కేంద్రం చొరవే. డీఎంకే లాంటి పార్టీల వల్ల రాష్ట్రం వెనుకబడుతోంది" అని విమర్శించారు.

**ఇప్పుడు ఏపీని చూడండి**

కేంద్ర సహకారంతో ఆంధ్రప్రదేశ్ ఎలా అభివృద్ధి పథంలో పయనిస్తోందో చంద్రబాబు వివరించారు. "దేశానికి వచ్చిన పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకి వచ్చాయి. గూగుల్, ఆర్సెలార్ మిట్టల్ వంటి దిగ్గజ కంపెనీలు పెట్టుబడులు పెడుతున్నాయి. డబ్బులు లేకున్నా, ల్యాండ్ పూలింగ్ వంటి వినూత్న పద్ధతిలో రాజధాని నిర్మిస్తున్నాం. ఇదంతా కేంద్రం సహకారంతోనే సాధ్యమైంది. తమిళనాడులోనూ డబుల్ ఇంజన్ సర్కార్ వస్తే బుల్లెట్ స్పీడ్‌తో అభివృద్ధి జరుగుతుంది" అని ఆయన భరోసా ఇచ్చారు.

# ఏయూ శతాబ్ది వేడుకలపై కలెక్టర్ సమీక్ష

**పటిష్ట ఏర్పాట్లకు ఆదేశాలు**

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఏప్రిల్ 21 :**ఉప రాష్ట్రపతి, ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రులు, గవర్నర్లు వంటి ప్రముఖులు హాజరుకానున్న నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లు అత్యంత కట్టుది ట్టంగా ఉండాలని స్పష్టం చేశారు. అతిథుల రా కపోకలు, హెలిప్యాడ్ నిర్వహణ, రూట్ మ్యాప్, వేదిక అమరికలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూ చించారు.అతిథులు, విద్యార్థుల కోసం వేర్వేరు గ్యాలరీలు ఏర్పాటు చేయాలని, తాగునీరు, స్నాక్స్, టాయిలెట్లు వంటి ప్రాథమిక సదుపా యాలు సమృద్ధిగా కల్పించాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరా అంతరాయం లేకుండా బ్యా కప్ జనరేటర్లు సిద్ధంగా ఉంచాలని పేర్కొన్నారు.



గ్యాలరీలకు ఇన్‌చార్జులను నియమించి, వారు ఒకరోజు ముందుగానే స్థలాన్ని పరిశీలించాలని సూచించారు. ఏప్రిల్ 23, 24 తేదీలలోపు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని నిర్దేశించారు. పారి శుద్ధ్య పనులను వెంటనే ప్రారంభించి రోజుకు వందమంది కార్మికులను నియమించాలని చెప్పారు. కార్యక్రమం నిర్వహణ కోసం ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని కూడా ఆదేశించారు.
ఈ సమీక్షలో డీసీపీ విజయ్ మణికంఠ, ఇన్‌చార్జి ఆర్డీవో శేషశైలజతో పాటు వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

# వేతనాలు ఎప్పటిలానే వారానికి ఇవ్వాలని కాఫీ కార్మికుల వినతి



**గూడెంకొత్తవీధి,పెన్ పవర్,ఏప్రిల్ 21:**ఏపీఎఫ్ డీసీ కాఫీ తోటల పనికి వచ్చే తమకు వేతనాలు ఎప్పటిలానే వారానికి ఒకసారి ఇవ్వాలని కార్మికులు డిమాండ్ చేశారు. మండలంలోని సిరిబాల, మురగడపల్లి, కోరపల్లి ప్రాంతాలకు చెందిన కార్మికులు మంగళవారం సమావేశమయ్యారు.ఏపీఎఫ్ డీసీ యాజమాన్యం గతంలో వారానికి ఒకసారి వేతనాలు అందించే వారిని తెలిపారు. అయితే తాజాగా నెలకు ఒకసారి బ్యాంకు ఖాతాల్లో వేతనాలు ఇస్తామని అధికారులు చెబుతున్నారని పేర్కొన్నారు. అలా చేయడంవల్ల తాము వారంతపు ఖర్చులకు ఇబ్బందులకు గురవుతామని పేర్కొన్నారు. వారం వారం వేతనాలు అందజేస్తే ఇంటికి సరిపడా సామాగ్రి కొనుగోలు చేసుకునేందుకు వీలవుతుందని పేర్కొన్నారు. నెలకు ఒకసారి వేతనం ఇస్తే అర్థకలితో ఇబ్బందులకు గురవుతామని పేర్కొన్నారు. ఈ సమస్యను వైకాపా జిల్లా నాయకుడు ఆంజనేయులు దృష్టికి కార్మికులు తీసుకువెళ్లారు. దీంతో ఆయన మాట్లాడుతూ కార్మికులకు ఎప్పటిలానే వారం వారం వేతనాలు అందించాలని డిమాండ్ చేశారు. ఉన్నతాధికారులు ఈ విషయాన్ని పరిశీలించాలని కోరారు. లేకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

# స్కిల్ కేసులో చంద్రబాబు మచ్చలేని చంద్రుడు

## ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకొన్న ముంచంగిపుట్టు టీడీపీ నాయకులు.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఏప్రిల్ 21.**స్కిల్ డెవలప్మెంట్ కేసులో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మచ్చలేని చంద్రుడిగా బయటపడ్డారని, న్యాయం గెలిచిందని ముంచంగిపుట్టు మండల టిడిపి నేతలు అన్నారు. ఈ సందర్భంగా వారు మంగళవారం పాత్రికేయులకు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలో కరీముక్కిపుట్ పంచాయతీలో వెలసిన శ్రీ శ్రీ శ్రీ మా భైరవి దేవత వద్ద గతంలో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు గత ప్రభుత్వంలో అక్రమంగా అన్యాయంగా స్కిల్ డెవలప్మెంట్ కెసులో అరెస్ట్ అయినప్పుడు, చంద్రబాబు నిర్దోషిగా బయటకు వచ్చి మళ్లీ సీఎం అయితే ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకుంటామని అప్పట్లో మొక్కుకున్నారు. ఈ నేపథ్యంలోనే కరీముక్కిపుట్ పంచాయతీ గ్రామంలో వెలసిన శ్రీ శ్రీ శ్రీ మా భైరవ దేవత వద్ద మాజీ అరకు పార్లమెంట్ ఆర్గనైజేషన్ సెక్రటరీ పాంగి శాస్త్రి బాబు, అసెంబ్లీ వైస్ ప్రెసిడెంట్ రాణాసింగి నిలకంఠం పాత్రోల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు. 2014-19 టీడీపీ ప్రభుత్వం హయాంలో నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాటు చేసిన ఏపిఎస్ ఎస్ డి సి కేసులో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ ప్రేరేపిత ఆరోపణలు చేసి రూ. 371 కోట్ల స్కాం జరిగిందని తప్పుడు ప్రచారం చేసి, చంద్రబాబు నాయుడును గత ప్రభుత్వం అన్యాయంగా అక్రమంగా 53 రోజులు అరెస్టు చేసారన్నారు. అయిన చంద్రబాబు నాయుడు మీద వచ్చిన ఆరోపణల్లో ఎలాంటి వాస్తవాలు లేవని ఏసీబీ కోర్టు తేల్చి చెప్పిందన్నారు. సిఐడి దర్యాప్తులో అవినీతి జరిగినట్లు ఆధారాలు లేవని, ఇది 'మిస్టేక్ ఆఫ్ ఫ్యాక్ట్' (తప్పుడు అవగాహనతో పెట్టిన కేసు) అని పేర్కొంటూ కేసును మూసివేసిందన్నారు. ఈ కేసులో ఎలాంటి నిధుల దుర్వినియోగం జరగలేదని సీఐడీయే స్వయంగా ఒప్పుకుని కోర్టుకు నివేదిక సమర్పించిందని, న్యాయస్థానం దానిని ఆమోదించిందని, న్యాయం గెలిచి మచ్చలేని చంద్రుడిగా నారా చంద్రబాబు నాయుడు చరిత్ర లిఖించిన నాయకుడిగా మరోసారి ముఖ్యమంత్రి అయ్యారని పార్టీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముంచంగిపుట్టు మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు కిల్లో సన్యాసమ్మ, రాష్ట ఎస్టీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ గడ్డంగి రామూర్తి, మాజీ మండల అధ్యక్షులు కిల్లో బలరాం, మాజీ వైస్ ఎంపీపీ రేయ్యాల కొండలరావు, పి ఏ సి డైరెక్టర్ రోబ్బ గణపతి, పార్టీ నాయకుడు నాయకం శంకర్, గొల్లోరి రఘునాధ్, మట్టం రఘుపతి పడల్, కూడా సుబ్రహ్మణ్యం, పెనుమాలు చిరంజీవి, ఎన్ గోపాల్ రావు, ఎన్ అనిల్, మత్స్యరాజు, భగీరథ, కామేష్, రాజు, నాగేష్, త్రీనాథ్, ఎం పరుశురాం, వి జగదీష్, నాగేష్, జే గంగాధర్, మండి ప్రభాకర్, చెట్టి నవీన్ కుమార్, పాంగి హరీష్, మల్లి, బాలన్న, రూప, సింహాచలం, గురుమూర్తి, కృష్ణ పాత్రో, చంద్ర పాత్రో, ధనుర్జాయ్, సిద్ధ, మంగళన్న పరమేష్, అభిమానులు శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ కార్మికులకు శుభవార్త రూ.1805 కోట్లు విడుదల




**విశాఖ, పెన్ పవర్, ఏప్రిల్ 21 :**ఉపాధి హామీ పథకం కింద పని చేసిన శ్రామి కులకు పెండింగ్‌లో ఉన్న వేతనాల చెల్లింపులకు కేంద్ర ప్రభుత్వం రూ.1805 కోట్లు విడుదల చే సింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబం ధించిన ఈ నిధులు త్వరలోనే కార్మికుల బ్యాం కు ఖాతాల్లో జమ కానున్నాయి.గత ఏడాది డిసెంబర్ నుంచి ఇప్పటివరకు ఉపాధి పనులకు హాజరైన కార్మికులకు సుమారు రూ.1042 కోట్ల వేతనాలు పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు తెలిపారు. తాజాగా విడుదలైన నిధులతో ఈ బకాయిలను చెల్లించనున్నట్లు స్పష్టం చేశారు.
అదనంగా, ఈ నెలాఖరు వరకు చేపట్టే ఉపాధి పనుల నిర్వహణకు మిగిలిన నిధులను విని యోగించనున్నట్లు రాష్ట్ర పంచాయతీరాజ్ మ రియు గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణ తేజ వెల్లడించారు.
ఈ నిధుల విడుదలతో రాష్ట్రవ్యాప్తంగా ఉపాధి హామీ కార్మికులకు ఊరటనిచ్చే అవకాశం ఉంద ని అధికారులు భావిస్తున్నారు.

# కొమ్మలవాడలో భూ వివాదం... ప్రభుత్వ భూమిగా నిర్ధారణ

**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, ఏప్రిల్ 21:** గూడెం కొత్తవీధి మండలం, దుప్పలవాడ పంచాయతీ పరిధిలోని కొమ్మలవాడ గ్రామంలో చోటుచేసుకున్న భూ వివాదంపై మండలస్థాయి సమన్వయ కమిటీ (ఎంఎల్ సిసి ) సమావేశం నిర్వహించారు.జీకే వీధి తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ హెచ్ అన్నాజీ రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో సంబంధిత రికార్డులను సమగ్రంగా పరిశీలించారు.ఈ సందర్భంగా వివాదాస్పద భూమి బంజరు (ప్రభుత్వ భూమి)గా వర్గీకరించబడినట్లు అధికారులు నిర్ధారించారు. దీంతో ఆ భూమిపై హక్కులు చెప్పుకుంటున్న బట్ట ధర్మరాజు, కెలేబు రాధమ్మలకు ఆ స్థలంలోకి ప్రవేశించకూడదని, ఎటువంటి జోక్యం చేసుకోకూడదని కఠినంగా హెచ్చరించారు.భవిష్యత్తులో ఇలాంటి వివాదాలు, ఆక్రమణలు జరగకుండా ఉండేందుకు ఆ స్థలంలో జాగ్రత్త బోర్డు ఏర్పాటు చేయాలని సంబంధిత విఆర్వోకు తహసీల్దార్ సూచనలు జారీ చేశారు.ఈ సమావేశంలో ఎంపీడీవో బిహెచ్వి రమణబాబు, జీకే వీధి ఎస్సై సురేష్ తదితరులు పాల్గొన్నారు.




# శ్రీ మోదకొండమ్మ రాష్ట్ర పండుగను వైభవంగా నిర్వహించాలి: కలెక్టర్ నిషాంతి

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి





**ఉత్సవ కమిటీ అధ్యక్షురాలుగా గిడ్డి ఈశ్వరి ఏకగ్రీవ ఎన్నిక**

**ఉత్సవాలకు గిడ్డి ఈశ్వరి లక్ష విరాళం, కలెక్టర్ రూ.50 వేలు, జేసీ రూ.10 వేలు**

**పాడేరు, పెన్ పవర్, ఏప్రిల్ 21:** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ మోదకొండమ్మ అమ్మవారి ఉత్సవాలను రాష్ట్ర పండుగగా ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో, ఈ వేడుకలను అత్యంత వైభవంగా, ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ టి. నిషాంతి అధికారులను, కమిటీ సభ్యులను ఆదేశించారు.
మంగళవారం ఉదయం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అమ్మవారి ఆలయ కమిటీ, ఉత్సవ కమిటీ సభ్యులు, వర్తక-వాణిజ్య, ఉద్యోగ, ప్రజా సంఘాల ప్రతినిధులతో రెండో విడత ఉత్సవ ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు.
అమ్మవారి పండుగను ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర స్థాయి వేడుకలకు అనుగుణంగా ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ముందస్తు ఏర్పాట్ల కోసం ప్రభుత్వం రూ.10 లక్షలు విడుదల చేసిందని, సంబంధిత శాఖలకు నిధులు కేటాయించామని తెలిపారు.
ఉత్సవాల పర్యవేక్షణ కోసం సమావేశంలో పాల్గొన్న సభ్యులందరూ ఏకగ్రీవంగా మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరిని ఉత్సవ కమిటీ అధ్యక్షురాలుగా ఎన్నుకున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం తాగునీరు, క్యూ లైన్లు, ప్రసాదం పంపిణీ, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని నిర్ణయించారు. వీఐపీలకు, సామాన్య భక్తులకు ఇబ్బంది కలగకుండా దర్శన ఏర్పాట్లు సక్రమంగా చూసుకోవాలని ఆలయ కమిటీకి సూచించారు. వివిధ శాఖల అధికారులు, కమిటీ సభ్యులు నిర్లక్ష్యం లేకుండా సమన్వయంతో పనిచేసి పండుగను సజావుగా, ప్రశాంతంగా, వైభవంగా నిర్వహించాలని కలెక్టర్ కోరారు.

**లివిరాళాల వెల్లువ:**

పండుగ నిర్వహణ కోసం ఉత్సవ కమిటీ అధ్యక్షురాలు గిడ్డి ఈశ్వరి రూ.1 లక్ష, జిల్లా కలెక్టర్ నిషాంతి రూ.50 వేలు, జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ రూ.10 వేలు విరాళంగా ప్రకటించారు. సమావేశం అనంతరం ప్రకటించిన విరాళపు మొత్తాన్ని అధ్యక్షురాలు, అధికారులు కమిటీకి అందజేశారు.
అనంతరం నూతన ఉత్సవ కమిటీ అధ్యక్షురాలు గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ, ప్రతి కమిటీ సభ్యుడు, అధికారులు, ఉద్యోగస్తులు, వివిధ సంఘాలు, మార్కెట్ వర్తక సంఘాలు బాధ్యతాయుతంగా పనిచేసి ఉత్సవాల విజయవంతానికి కృషి చేయాలని కోరారు. అనంతరం సభ్యులతో కలిసి పండుగ పోస్టర్‌ను కలెక్టర్ విడుదల చేశారు.
ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ, డీఆర్వో (ఎఫ్ఏసి) ఎం.వి.ఎస్. లోకేశ్వరరావు, ఆలయ కమిటీ ప్రతినిధులు, జీసీసీ డైరెక్టర్ బొర్రా నాగరాజు, ట్రైకార్ చైర్మన్ కృష్ణారావు, పీఏసీఎస్ చైర్మన్ రమణ, ఇతర ప్రజా ప్రతినిధులు, స్థానిక వాణిజ్య సంఘాల ప్రతినిధులు, ఉద్యోగ సంఘాల నేతలు పాల్గొన్నారు.

## సిహెచ్సిని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

- ఏ పరిశుభ్రత లోపిస్తే కాంట్రాక్ట్ రద్దు



**విజయనగరం టౌన్, పెన్ పవర్, ఏప్రిల్ 21 :** బాడంగి మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సిహెచ్సి)ను జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించిన ఆయన, రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ?తొలుత ఓపీ విభాగాన్ని సందర్శించిన కలెక్టర్, అనంతరం వార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆసుపత్రి ప్రాంగణంలో పారిశుధ్యం అధ్వాన్నంగా ఉండటంపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేద ప్రజలకు వ్యాధులు తగ్గాల్సింది పోయి, అపరిశుభ్రత వల్ల కొత్త రోగాలు వచ్చేలా ఉండకూడదని అధికారులను హెచ్చరించారు. పరిశుభ్రత నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్న కాంట్రాక్టర్‌పై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం రోజుల్లోపు ఆసుపత్రి అంతటా పరిశుభ్రత మెరుగుపడాలని ఆదేశించారు. నిర్ణీత గడువులోగా మార్పు రాకపోతే సదరు కాంట్రాక్ట్ ను తక్షణమే రద్దు చేసి, బాధ్యతలను వేరే వారికి అప్పగిస్తామని స్పష్టం చేశారు.? ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలంటే వైద్యంతో పాటు ఆసుపత్రి వాతావరణం పరిశుభ్రంగా ఉండటం అత్యంత ముఖ్యమనీ, ఇందులో ఎలాంటి రాజీ పడకూడదనీ కలెక్టర్ పేర్కొన్నారు.

## ప్రభుత్వ సేవల్లో పారదర్శకత, వేగం ఉండాలి

- తెర్లాంలో జిల్లా కలెక్టర్ రామసుందర్ రెడ్డి ఆకస్మిక తనిఖీలు






**విజయనగరం టౌన్, పెన్ పవర్, ఏప్రిల్ 21 :** విజయనగరం జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి మంగళవారం తెర్లాం మండలంలో సుడిగాలి పర్యటన చేపట్టారు. పలు ప్రభుత్వ కార్యాలయాలను, శిక్షణ కార్యక్రమాలను ఆకస్మికంగా తనిఖీ చేసి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ముందుగా తెర్లాం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్, అక్కడ రికార్డులను మరియు కార్యాలయ పనితీరును సమీక్షించారు. కార్యాలయ పరిధిలో రెవెన్యూ తక్కువగా ఉండటంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆదాయం పెరిగేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యాలయానికి వచ్చిన వినియోగదారులతో నేరుగా మాట్లాడి, వారికి అందుతున్న సేవల నాణ్యత గురించి అడిగి తెలుసుకున్నారు. సేవలలో ఉన్న లోపాలను వెంటనే సరిదిద్దాలని, ప్రజలకు వేగవంతమైన, పారదర్శక సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ?అనంతరం తెర్లాం మండల సమాఖ్య భవనంలో జరుగుతున్న సెన్సస్ (జనగణన) శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లు ప్రతి వివరాన్ని అత్యంత ఖచ్చితత్వంతో నమోదు చేయాలని సూచించారు. సమగ్ర గణాంకాలు భవిష్యత్తులో ప్రభుత్వ ప్రణాళికల రూపకల్పనకు మూలాధారమని గుర్తు చేశారు. ప్రజలు తమ వివరాలను స్వయంగా నమోదు చేసుకునే 'సెల్ఫ్ ఎన్యూమరేషన్' విధానంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని, డిజిటల్ సదుపాయాలను ప్రోత్సహించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. తెర్లం పర్యటనలో భాగంగా ఎం ఎల్ ఎస్ పాయింట్ ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ?తూనిక ప్రక్రియలో ఎటువంటి లోపాలు లేకుండా చూడాలని, వేస్టేజ్ జరగకుండా జాగ్రత్త వహించాలని ఆదేశించారు. అధికారుల సమక్షంలో మూడు బస్తాలను స్వయంగా తూకం వేయించి, బరువు సరిగ్గా ఉండటంతో ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట తెర్లాం తహసీల్దార్ హేమంత్, గోదాం ఇంచార్జి అప్పయ్య మరియు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# డిసిసిబి అభివృద్ధిపై ప్రశంసలు

- చైర్మన్ నాగార్జున ను ప్రశంసించిన ఆప్కాబ్ ఎండీ రామకృష్ణ
- ఎన్‌పీఏలు తగ్గుదల -- ఆర్థిక క్రమశిక్షణకు నిదర్శనం
- డిపాజిట్లలో పెరుగుదల -- ప్రజల విశ్వాసానికి ప్రతీక
- పారదర్శక పదోన్నతులు -- ఉద్యోగుల్లో నూతనోత్సాహం
- సిబ్బంది కృషి, సమన్వయం -- అభివృద్ధికి మూలం
- డిసిసిబి సిబ్బంది హర్షం వ్యక్తం




**పెన్ పవర్ చీపురుపల్లి, ఏప్రిల్ 21:**
విజయనగరం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డిసిసిబి) సమష్టి కృషితో అభివృద్ధి పథంలో సాగుతోందని ఆంధ్రప్రదేశ్ స్టేట్ కో ఆపరేటివ్ బ్యాంక్ (ఆప్కాబ్) మేనేజింగ్ డైరెక్టర్ ఆర్.వి.రామకృష్ణ విజయనగరం డిసిసిబి చైర్మన్ కిమిడి నాగార్జున ను ప్రశంసించారు. ఎన్‌పీఏలను గణనీయంగా తగ్గించడం ద్వారా బ్యాంకు ఆర్థిక స్థితిని బలోపేతం చేయడంలో నాగార్జున , సిబ్బంది కలిసి పనిచేసిన తీరు ప్రశంసనీయమని అన్నారు.
అలాగే డిపాజిట్లలో పెరుగుదల సాధించడం ద్వారా ప్రజల్లో నమ్మకాన్ని పెంచి, బ్యాంకును విశ్వసనీయ సంస్థగా నిలబెట్టారని పేర్కొన్నారు.
పదోన్నతులను పారదర్శకంగా అమలు చేయడం ద్వారా ఉద్యోగుల్లో నమ్మకం, ఉత్సాహం పెరిగిందని, ఇది సేవల నాణ్యతను మెరుగుపరుస్తుందని తెలిపారు. సిబ్బంది సంక్షేమం, పనితీరు మెరుగుదలకు అనుకూల విధానాలు అమలు చేయడం బ్యాంకు ప్రత్యేకతగా నిలుస్తోందని చెప్పారు.
డిసిసిబి చైర్మన్ కిమిడి నాగార్జున ఆధ్వర్యంలో యాజమాన్యం, సిబ్బంది కలిసి పని చేయడం వల్లే ఈ స్థాయి అభివృద్ధి సాధ్యమైందని ఆయన అభిప్రాయపడ్డారు.
ఈ సందర్భంగా డిసిసిబి ఉద్యోగులు సంతోషం వ్యక్తం చేస్తూ, భవిష్యత్తులో మరింత మెరుగైన ఫలితాలు సాధించేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు.
ఈ కార్యక్రమంలో డిసిసిబి ఉన్నతాధికారులు,శాఖ మేనేజర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రజా పరిష్కార వేదిక -- ప్రజాదర్బార్ నిర్వహణ....





**పలాస, పెన్ పవర్ : ఏప్రిల్ 21.**నియోజకవర్గ స్థానిక శాసనసభ్యుల వారి కార్యాలయంలో ఈ రోజు ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్దేశించిన "ప్రజా పరిష్కార వేదిక -- ప్రజా దర్బార్" కార్యక్రమం అధికారికంగా నిర్వహించబడింది.
ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు హాజరై తమ సమస్యలను శాసనసభ్యురాలికి వినిపించారు. ముఖ్యంగా పింఛన్లు, రేషన్ కార్డులు, గృహ నిర్మాణాలు, తాగునీరు, రహదారులు, విద్యుత్ తదితర సమస్యలకు సంబంధించిన 22 మంది వినతిపత్రాలను సమర్పించారు.
శాసనసభ్యురాలు ప్రజల వినతులను శ్రద్ధగా పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేశారు.
ఈ సందర్భంగా శాసనసభ్యురాలు మాట్లాడుతూ, ప్రజలకు అందుబాటులో ఉండటం తమ ప్రధాన బాధ్యత అని, ప్రజలు నేరుగా తమ సమస్యలను తెలియజేయడం ద్వారా వేగవంతమైన పరిష్కారం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు....

# 24న ఎపిఆర్‌జెసి ప్రవేశపరీక్ష



పకడ్బంధీగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించిన డిఆర్ఓ

**విజయనగరం టౌన్, పెన్ పవర్, ఏప్రెల్ 21 :** ఈ నెల 24న జరగనున్న ఏపిఆర్‌జెసి డిసి సెట్‌కు పకడ్బంధీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు అధికారులను ఆదేశించారు. ఈ ప్రవేశపరీక్ష నిర్వహణపై తమ ఛాంబర్‌లో మంగళవారం వివిధ శాఖల ప్రతినిధులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. పరీక్ష నిర్వహణకు పట్టణంలో 10 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఈ పరీక్షలకు 3,361 మంది విద్యార్థులు హాజరు కానున్నారని, దానికి తగ్గట్టుగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. 5 నుంచి 8వ తరగతిలో ప్రవేశానికి ఉదయం 10 నుంచి 12 గంటలు వరకు, ఇంటర్, డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకోసం మధ్యాహ్నం 2.30 నుంచి పరీక్ష జరుగుతుందని తెలిపారు. పరీక్షలకు దరఖాస్తు చేసుకున్నవారు గంట ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రంలోనికి సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాలవద్ద 144 సెక్షన్ విధించాలని, విద్యార్థులు ఎటువంటి ఇబ్బంది లేకుండా త్రాగునీరు, పారిశుధ్యం, నిరంతర విద్యుత్ సదుపాయం, పోలీసు బందోబస్తు, గదుల్లో తగిన లైటింగ్, ఫ్యాన్లు, కేంద్రాలవద్ద ప్రథమ చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖలను డిఆర్ఓ సత్తిబాబు ఆదేశించారు. ఈ సమావేశంలో తాటిపూడి రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపల్, ఏపిఆర్‌జెసి డిసి జిల్లా సమన్వయకర్త చౌదరి శారదాబాయ్, వివిధ శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

## భగ్గుమంటున్న బ్రాహ్మణ తర్ల ఆంజనేయ స్వామి విగ్రహ ఏర్పాటు స్థల వివాదము





**పలాస, పెన్ పవర్ :ఏప్రిల్ 21...** పలాస మండలం మేజర్ పంచాయితీ బ్రాహ్మణతర్ల గ్రామంలో ఆంజనేయ స్వామి విగ్రహ ఏర్పాటుపై వైకాపా టిడిపి వర్గాల మధ్య స్థల వివాదంతో పరస్పర ఆరోపణలకు దిగారు..అందరికీ అనువైన ఆటో జంక్షన్ వద్ద ఆంజనేయ స్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు వైకాపా సంకల్పించగా గతంలో విగ్రహ ఏర్పాటుకు ప్రతిష్ట పూజ చేసిన గీతా మందిరం పక్కన లేకపోతే శివాలయం వద్ద ఏర్పాటు చేసుకోవాలని టిడిపి వర్గీయులు నిరసనకు దిగారు దేవుని పేరుతో రాజకీయాలకు దిగడం సరికాదని దీనికి ఎమ్మెల్యే గౌతు శిరీష వివరణ ఇవ్వాలని అనడం సరికాదని ఆమెకు సంబంధము లేని అంశములో ఆమె వివరణ ఇవ్వాలని కోరడం ఇంకా దుర్మార్గమని విమర్శించారు రాబోయే రోజుల్లో బ్రాహ్మణతర్ల జంక్షన్ వద్ద రోడ్డు విస్తరించే అవకాశం ఉన్నందున ఆంజనేయ విగ్రహము అక్కడ ఏర్పాటు ఏమాత్రం సబబు కాదని వాదిస్తున్నారు ఆ జంక్షన్ లో విద్యుత్ స్తంభాన్ని ట్రాన్స్ఫర్ ని వేరొక చోటకు మార్పించి గ్రామ కూడలిలో విగ్రహ ఏర్పాటు సబబుగా ఉంటుందని అది గ్రామానికి కూడా మంచిదని తలచి ఆ ప్రాంతాన్ని చదును చేసి గోతులు తవ్వడంతో రాత్రికి రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కప్పి పెట్టడం కవ్వింపు చర్యగా వైకాపా వర్గీయులు అభివర్ణిస్తూ గ్రామ పెద్దలందరి ఆమోదంతోనే అక్కడ విగ్రహ ఏర్పాటుకు సుమారు 7 లక్షల రూపాయలుఖర్చు చేసేందుకు దాతలు ముందుకు వచ్చారని వారందరి మనోభావాలు దెబ్బతీసే విధంగా ప్రత్యర్థుల చర్యలు ఉన్నాయని వైకాపా వర్గీలో వాదిస్తున్నారు ప్రశాంతంగా ఉండే బ్రాహ్మణ తర్ల లో దేవుని విగ్రహ ఏర్పాటు వివాదము ఇప్పుడు భగ్గుమంటోంది...

## చిన్నారులు ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి

- ఐసిడిఎస్ సూపర్వైజర్ ఉషశ్రీ
- భావనపాడులో అంగన్వాడి కేంద్రాల్లో పోషణ పక్వాడ అవగాహన సదస్సు



**టెక్కలి, పెన్ పవర్ ఏప్రిల్ 21 :** చిన్నారులు ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ ఉషశ్రీ సూచించారు. టెక్కలి సిడిపిఓ సిహెచ్ హైమావతి ఆదేశాల మేరకు మంగళవారం సంతబొమ్మాలి మండలం భావనపాడులో అంగన్వాడీ 1, 3 కేంద్రాల్లో నిర్వహించిన పోషణ పక్వాడ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ వైజర్ ఉషశ్రీ మాట్లాడుతూ చిన్నారులకు పౌష్టికాహారం తప్ప జింక్ ఫుడ్ ఇవ్వరాదని, అటువంటి ఆహారం పిల్లలకు ఇస్తే భవిష్యత్తులో క్యాన్సర్ వంటి వ్యాధులు సోకే ప్రమాదం ఉందని స్పష్టం చేశారు. అలాగే పిల్లలకు టీవీలు సెల్ ఫోన్లు చూడకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె సూచించారు. అంతేకాకుండా చిన్న వయసు లోనే మెదడు అభివృద్ధి జరుగుతుందని 18- 24 నెలలు పిల్లలకు పరిమితంగా స్క్రీన్ సమయం ఇవ్వాలని తెలిపారు. 2-5 సంవత్సరాల పిల్లలకు వారానికి ఒక గంట మాత్రమే స్క్రీన్ టైం ఉండాలని సూచించారు. పిల్లలకు ఆరుబయట ఆట్లాడించడం పై అవగాహన కల్పించారు. మహిళలు, గర్భిణీలు, కిశోర బాలికలకు పోషకాహారం వల్ల కలిగే ఆరోగ్యం గురించి క్షేత్రస్థాయిలో ప్రజలను చైతన్య పరుస్తున్నామన్నారు. కార్యక్రమములో వంటల ప్రదర్శన, తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు.అనంతరం భావనపాడు లో మూడు అంగన్వాడి కేంద్రాలను సూపర్వైజర్ ఉషశ్రీ రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు కళావతి, రాజేశ్వరి,పార్వతి ఆయాలు ధనలక్ష్మి,కల్పన పిల్లలు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## భూముల రీ సర్వే ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి



**టెక్కలి, పెన్ పవర్ ఏప్రిల్ 21 :** సంతబొమ్మాలి మండలం,ఆకాశ లఖవరం గ్రామపంచాయతీ పరిధిలో మంగళవారం రెవెన్యూ అధికారులు రైతులు తాలూకా భూములు రీ సర్వే ప్రారంభించారు. కనుక పంచాయతీ పరిధి లోని ఆకాశలఖవరం, సీరపువానిపేట, సుగ్గువానిపేట, గూలవానిపేట గ్రామాల రైతులు సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఏఎంసి చైర్మన్, సర్పంచ్ ప్రతినిధి సుగ్గు రామిరెడ్డి ఈ సందర్భంగా కోరారు. రైతులు దగ్గరుండి మీయొక్క భూములను సక్రంగా రీ సర్వే చేయించుకోవాలని సూచించారు. రీ సర్వే చేయించుకుంటే ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పని ఉండదని అన్నారు.

# కడుతులలో నీటి సమస్య పరిష్కరిస్తాం - ఎంపీడీవో

- 110 కుటుంబాలకు ఒకే నుయ్యి ఆధారం.
- నీటి సౌకర్యం కల్పించాలని ఎంపీడీవో దృష్టికి తెచ్చిన మహిళలు.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఏప్రిల్ 21.** మండలంలో గల పనసపుట్టు పంచాయితీ, కడుతుల గ్రామంలో తీవ్ర నీటి సమస్యలు ఉన్న నేపథ్యంలో గ్రామంలో మండల అభివృద్ధి అధికారి కే ధర్మారావు మంగళవారం నీటి వనరులను పరిశీలించారు. గ్రామంలో 110 కుటుంబాలుగా 352 మంది జనాభా కలిగి ఉన్నామని, తీవ్రమైన నీటి సమస్యతో గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నామని, నీటి సమస్య పరిష్కారానికి చొరవ చూపలని ఎంపీడీవో దృష్టికి గ్రామ మహిళలు తీసుకువచ్చారు. గ్రామంలో నీటి సరఫరాకు ప్రధాన వనరుగా ఉన్న గ్రావిటీ ఎండ తీవ్రత వల్ల ఇంకిపోవడంతో మంచినీటి కొరకు గ్రామస్తులు ఒక్క నుయ్యి మీద మాత్రమే నీటి సేకరణకు ఆధారపడవలసి వస్తుందని, అందులో కలుషితమైన నీటిని సేకరించి అనారోగ్యం పాలవుతున్నట్లు ఎంపీడీవో దృష్టికి తీసుకు వచ్చారు. దీంతో గ్రామంలో మంచి నీటి కల్పనకు కృషి చేస్తానని మహిళలకు ఎంపీడీవో హామీ ఇచ్చారు. అదేవిధంగా గ్రామంలో నిర్మించిన పైప్ లైన్, ట్యాంకుతో పాటు నూతనంగా వేసిన రెండు బోర్లను ఎంపీడీవో పరిశీలించారు. గ్రామంలో ప్రతి వీధికి పైప్ లైన్ వేసి టేపులు బిగించారని, బోరు బావిలో నుంచి గ్రామంలో నీటి సరఫరాకు లోవాల్టేజ్ విద్యుత్ సమస్య ఏర్పడుతుందని, నూతన ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటుచేసి గ్రామంలో మంచినీటి సరఫరా చేయాలని గ్రామస్తులు ఎంపీడీవో దృష్టికి తీసుకువచ్చారు. ఎన్నో ఏళ్లుగా నీటి సమస్యతో సతమతమవుతున్న గ్రామస్తులకు ఎంపీడీవో పర్యటన నీటి సమస్య పరిష్కారం అవుతుందో లేదో వేచి చూడాలి.






## కష్టకాలంలో పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలకే మొదటి ప్రాధాన్యత - నల్లూరు సూర్యనారాయణ





**కూర్మన్నపాలెం : పెన్ పవర్, ఏప్రిల్ 21:** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 76వ జన్మదినోత్సవం సందర్భంగా, 86 వార్డు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో వార్డు పార్టీ అధ్యక్షుడు నల్లూరు సూర్యనారాయణ ఆధ్వర్యంలో కేక్ కటింగ్ చేసి, స్వీట్స్ పంచిపెట్టి చంద్రబాబు నాయుడుకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు . ఈ సందర్బంగా వార్డు అధ్యక్షుడు నల్లూరు సూర్యనారాయణ,నల్లూరు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా డాక్టర్ చెరుకూరి లిఖిత మాట్లాడుతూ పార్టీ కోసం మై టిడిపి యాప్ ద్వారా విస్తృత ప్రచారం చేసిన కార్యకర్తలకు , 2024 ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం అహర్నిశలు కష్టపడిన నాయకులు కార్యకర్తలకు ప్రోత్సాహకాలు అందజేసినట్లు తెలిపారు. వార్డులో పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడు గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు తనని అధ్యక్షుడిగా నియమించారని . అప్పటినుండి ఇప్పటివరకు వార్డులో ఉన్న ప్రజలకు కార్యకర్తలకు అండగా నిలిచానని తెలిపారు. పార్టీ కోసం పనిచేసే ప్రతి కార్యకర్తకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. అధిష్టానం రాబోయే ఎన్నికల్లో ఎవరికి టికెట్ ఇచ్చినా గెలుపు కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ వేగుంట శ్రీనివాస్ , ప్రధాన కార్యదర్శి బొడ్డేడ జగదీష్ , ఉపాధ్యక్షుడు కొర్లన్న రమేష్ , కోశాధికారి బొడ్డేపల్లి అప్పారావు , గాజువాక తెలుగు యువత అధ్యక్షుడు మానపురం గణపతి , సెక్రటరీలు రాయుడు నాగేశ్వరరావు , కాసాపు వెంకటేష్ , గాజువాక బీసీ సెల్ ఉపాధ్యక్షుడు వంగల నాగేశ్వరరావు , వార్డ్ బీసీ సెల్ అధ్యక్షుడు కోటపాటి సుబ్బయ్య , గాజువాక బీసీ సెల్ ఉపాధ్యక్షురాలు రుక్మిణి,వార్డు బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి బొబ్బిలి శ్రీను ,వార్డు మహిళా అధ్యక్షురాలు గుంపన వెంకటలక్ష్మీ , వార్డ్ తెలుగు యువత అధ్యక్షుడు అరిపాక లక్ష్మణ్ , తెలుగు యువత సెక్రటరీ సునీల్ , యూనిట్ ఇన్చార్జులు బండారు అప్పారావు , సాగి శ్రీనివాస రాజు , తలారి శ్రీనివాస్ , భూత్ ఇంచార్జీలు గోవింద్ ప్రధాని , కొలుసు వీరభద్ర రావు , వి ఆర్ కె రాజుగారు, రమణ రావు , కండేపల్లి నూక అప్పారావు , ఓబిలినేని లక్ష్మణరావు , పీర్ బాబా , మౌలా , చిన్ని , జానీ హుస్సేన్ , ఇల్తాఫ్ , జాగారపు ఎల్లాజీ , మునగాల శ్రీనివాస్ ,కలపాల శ్రీనివాస్ , చదరం తులసీరామ్ , లక్కరాజు వెంకటేష్ , దయానంద్ , దుర్గా ప్రసాద్ , సుబ్బలక్ష్మి, గండి పావని ,బడేటి కుమారి తదితరులు పాల్గొన్నారు.

## యువత మత్తు పదార్థాలకు, గంజాయికి దూరంగా ఉండాలి: ప్రిన్సిపాల్ డా. వనం చిట్టబ్బాయి

**పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'డ్రగ్స్ వద్దు బ్రో' అవగాహన కార్యక్రమం**



**పాడేరు, పెన్ పవర్, ఎప్రిల్ 21:** యువతీ యువకులు మత్తు పదార్థాలకు, గంజాయికి బానిసలు కాకుండా భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వనం చిట్టబ్బాయి సూచించారు.
స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) యూనిట్స్ మరియు ఈగల్ టీం సంయుక్త ఆధ్వర్యంలో "డ్రగ్స్ వద్దు బ్రో" అనే అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఈగల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ జి. దేముళ్ళు మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులు గంజాయి, డ్రగ్స్‌కు పూర్తిగా దూరంగా ఉండాలని హెచ్చరించారు. గంజాయి, డ్రగ్స్ కేసుల్లో ఇరుక్కుంటే పడే కఠిన శిక్షల గురించి వివరించారు. అలాగే డ్రగ్స్ సంబంధిత సమాచారం అందించేందుకు ఏర్పాటు చేసిన ఈగల్ టోల్ ఫ్రీ నెంబర్: 1972 గురించి తెలిపారు. సోషల్ మీడియాలో వచ్చే అనుమానాస్పద యాప్స్, లింక్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వాటిని సబ్స్క్రైబ్ చేయవద్దని విద్యార్థులకు అవగాహన కల్పించారు.
కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వనం చిట్టబ్బాయి మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు, గంజాయికి ఏమాత్రం అలవాటు పడకూడదని స్పష్టం చేశారు. పరిచయం లేని వ్యక్తులు డ్రగ్స్, గంజాయి రవాణా చేయమని కోరినా సున్నితంగా తిరస్కరించాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ఈగల్ క్లబ్ వాలంటీర్లు తమ తమ గ్రామాల్లో ప్రజలకు డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. అనంతరం ఈగల్ టీం ఆధ్వర్యంలో విద్యార్థినీ విద్యార్థులచే డ్రగ్స్‌కు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు.
ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ జిల్లా నోడల్ ఆఫీసర్ జి. గౌరీ శంకర్రావు, ఈగల్ టీం సభ్యులు సిహెచ్. సురేష్ కుమార్, సిహెచ్. శేఖర్, ఎం. కోటేశ్వరరావు, వి.వి. రమణ తదితరులతో పాటు అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మహిళల సాధికారతే కూటమి ప్రభుత్వ లక్ష్యం





ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి.

**కురుపాం, పెన్ పవర్, ఏప్రిల్ 21 :** కురుపాం నియోజకవర్గంలో మహిళల అభివృద్ధి, సాధికారతకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మంగళవారం నాడు కురుపాం నియోజకవర్గ కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉన్న వెలుగు కార్యాలయం వద్ద గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో గ్రామ సంఘాల సహాయకులు (వీఓఏ)లకు 5జీ స్మార్ట్ ఫోన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామ సంఘాల సహాయకులకు స్మార్ట్ ఫోన్లు అందజేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళల సాధికారతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రతి మహిళ స్వయం శక్తితో ఆదాయాన్ని సమకూర్చుకునే స్థాయికి చేరుకోవాలని సూచించారు. మహిళలకు ఎల్లప్పుడూ అండగా కూటమి ప్రభుత్వం నిలుస్తుందని తెలిపారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికతను అందిపుచ్చుకోవాలని, స్మార్ట్ ఫోన్లను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి అవకాశాలను విస్తరించుకోవాలని మహిళలకు సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మహిళల అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేస్తున్నారని తెలిపారు. మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగి తమ కుటుంబాలను అభివృద్ధి దిశగా నడిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి విజయనగరం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డొంకాడ రామకృష్ణ, కురుపాం వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్ పర్సన్ కడ్రక కళావతి, రాష్ట్ర కొప్పల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ అక్కేన మధుసూదన్ రావు, రాష్ట్ర కార్యదర్శి బిడ్డిక పద్మావతి, రాష్ట్ర నాటక రంగ అకాడమీ డైరెక్టర్ అంబటి రాంబాబు, కురుపాం, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస మండల కన్వీనర్లు కె.వి.కొండయ్య, అడ్డాకుల నరేష్, జోగి భుంజగరావు, బిజెపి మండల కన్వీనర్ కడ్రక అప్పలస్వామి, మాజీ కన్వీనర్ పాడి సుదర్శన్ రావు, కోట సుమన్, సుబ్బలక్ష్మి, సింహాచలం, రామకృష్ణ, ఎంపిడిఓ ఉమా మహేశ్వరీ, టిడిపి నాయకులు, కార్యకర్తలు, వెలుగు సిబ్బంది మరియు మహిళలు పాల్గొన్నారు.

## వితన శుద్ధి - నిల్వ కేంద్రం సందర్శన కార్యక్రమానికి వైసీపీ శ్రేణులు తరలిరండి

వైఎస్ఆర్సిపి టెక్కలి నియోజకవర్గం ఇంచార్జ్ పేరాడ తిలక్



**టెక్కలి, పెన్ పవర్ ఏప్రిల్ 21 :** నందిగాం మండలం శివరాంపురం పంచాయతీ బడబంద గ్రామం లోని "విత్తన శుద్ధి , నిల్వ కేంద్రం" వెంటనే ప్రారంభించి వినియోగంలోకి తేవాలని కోరుతూ వైసీపీ టెక్కలి నియోజకవర్గ ఇంచార్జ్ పేరాడ తిలక్ ఆధ్వర్యంలో విత్తన శుద్ధి – నిల్వ కేంద్రం సందర్శన కార్యక్రమం బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా తిలక్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం జగన్మోహన్ రెడ్డి హయాంలోనే నిర్మాణం పూర్తి చేసిందని అయినప్పటికీ ఈ కేంద్రం ప్రారంభానికి నోచుకోలేదని తెలిపారు. ఈ మేరకు వైసిపి ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 9:30 గంటలకు సందర్శిస్తున్నామని అన్నారు. ఈ మేరకు టెక్కలి నియోజకవర్గం లోని వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు

## సి బి ఎస్ ఇ 10 వ తరగతి ఫలితాలలో ప్రభంజనం సృష్టించిన శ్రిష్టి వరల్డ్ స్కూల్

**కూర్మాన పాలెం : పెన్ పవర్, ఏప్రిల్ 21**

ఉక్కునగరం సెక్టర్ -11 లో గల శ్రిష్టి వరల్డ్ స్కూల్ సి బి ఎస్ ఇ 10వ తరగతి ఫలితాలలో ప్రభంజనం సృష్టించింది. పాఠశాల నుండి 210 మంది విద్యార్థినీ విద్యార్థులు బోర్డు పరీక్షలు వ్రాయగా100 శాతం ఉత్తీర్ణత సాధించారు. డిస్టింక్షన్ లో 183 మంది, ప్రథమ శ్రేణిలో 23 మంది, ద్వితీయ శ్రేణిలో 4 గురు ఉత్తీర్ణత సాధించారు. 94 శాతం పైబడి 20 మంది విద్యార్థులు సాధించగా,90 శాతానికి పైగా 48 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. పాఠశాల టాపర్స్ గా 500 మార్కులకు 488 మార్కులు సాధించి డి. కార్తిక, బి. కృష్ణ చైతన్య 97.6 శాతం సాధించి ప్రథమ స్థానంలో ఉండగా, ఎన్. హేమచరణ్ 97.2 శాతం సాధించి ద్వితీయ స్థానంలో ఉన్నారు. బి. శ్రీహిత్ వర్ధన్ రెడ్డి, ఐ. లేఖ్య, జి. హేమ హాసిని 97 శాతం మార్కులు సాధించి తృతీయ స్థానాన్ని సాధించారు. ద్వితీయ భాష తెలుగులో ఎమ్. శ్రీ లాస్య, ఎమ్. నయన శృతి, టి. అక్షయ 100/100 వంద కి వంద మార్కులు సాధించి రికార్డు సృష్టించారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో 29 మంది విద్యార్థులు 100/100 మార్కులు సాధించి తమ ప్రతిభను నిరూపించారు. ఇంగ్లీషు, హిందీ, మ్యాథమెటిక్స్, సైన్స్, మరియు సోషల్ స్టడీస్ సబ్జెక్టుల్లో కూడా చాలామంది విద్యార్థులు 99 మార్కులు సాధించి వారి ప్రతిభను చాటుకున్నారు. ఇంతటి గొప్ప ఫలితాలను సాధించి మాకు మేమే సాటి అని నిరూపించిన అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు కిరణ్, మధుసూదన్, రాధిక, లలిత కుమారి, శిఖారాణి, నాగలక్ష్మి, శంకరరావు, మోహిని, నిర్మల, రవీంద్ర కుమార్ మహాపాత్ర, సునీల్ కుమార్ మహాపాత్ర ను, మరియు అడిషనల్ డైరెక్టర్ ఈ.చంద్రిక, ఎగ్జిక్యూటివ్ ప్రిన్సిపల్ కిరణ్ దేవగిరి, చీఫ్ అకాడమిక్ హెడ్ సంతోష్ కుమార్ ను పాఠశాల డైరెక్టర్ పి.సుశీలా రాణి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ మేఘన కంభం హర్షం వ్యక్తం చేసి అభినందించారు.

## శిదిలావస్థ కు చేరుకున్న రిటైనింగ్ వాల్....

**కురుపాం, పెన్ పవర్, ఏప్రిల్ 21:** కురుపాం ఏజెన్సీలో గల వలసభల్లేరు – ఆవిరి గ్రామాల నడుమ గల ఘాట్ రోడ్డు వద్ద రిటైనింగ్ వాల్ శిదిలావస్థ కు చేరుకుంది..ఆ రిటైనింగ్ వాల్ చాలా ఏళ్ల కిందట నిర్మించడం తో శిదిలావస్థ దశకు చేరుకుంది.దీనితో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు..ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆ రక్షణ గోడ స్థానం నూతన రక్షణ గోడను నిర్మాణం చేపట్టడం గాని తాత్కాలిక మరమ్మత్తులు



గాని చేపట్టాల్సింది గా ఆ ప్రాంత గిరిజనులు కోరుతున్నారు..

# బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం.సిడిపిఓ నాగమణి..



చీపురుపల్లి పెన్ పవర్ ఏప్రిల్,21: బాల్యవివాహాలు జరపడం చట్టరీత్యా నేరమని చీపురుపల్లి ఐసిడిఎస్ సిడిపిఓ పి నాగమణి అన్నారు. పోషణ పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం నాడు చీపురుపల్లి పట్టణ పరిధిలోని రామాంజనేయ కాలనీ, అంబేద్కర్ కాలనీ అంగన్వాడి సెంటర్ల పరిధిలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్న వయసులోనే వివాహాలు జరపడం వలన మహిళ ఆరోగ్యం దెబ్బతిని అనారోగ్యం పాలు అవుతారని, ఈ ఘటన పైన ప్రతి ఒక్క ఆడపిల్ల తల్లిదండ్రులు దృష్టి పెట్టాలని సూచించారు. తల్లి బిడ్డ ఆరోగ్యం కొరకు ప్రతి ఒక్కరూ పౌష్టిక ఆహారాన్ని తీసుకోవాలని తద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందాలని అంగన్వాడి సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంగన్వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా స్నాప్ ది స్నాక్ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిబిడ్డ ఆరోగ్యంగా ఉండటానికి అంగన్వాడీ కేంద్రాల ద్వారా అమలు జరుగుతున్న పౌష్టికాహారాన్ని పొందాలని కోరారు. జంక్ ఫుడ్ ల కారణంగా అనారోగ్యం పాలు కాగలరని ఆమె వివరించారు. పోషణ పక్వాడ 8వ పోషణ ప క్షోత్సవాల్లో అంగన్వాడీ కేంద్రంలో తల్లుల తో సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్యంగా తల్లి బిడ్డలు, గర్భిణీ స్త్రీలు, బాలింతలకు పౌష్టికాహారమే శ్రేయస్కరమని పిఓ అన్నారు. పిల్లలు మెదడు ఎదుగుదల కు,గర్భిణీ లు ఆరోగ్య పరిరక్షణకు పౌష్టికాహారం తప్పని సరిగా తీసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో గర్భిణీ లు,బాలింతలు, తల్లిదండ్రులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ శైశవ దశ లోగల పిల్లలు మెదడు ఎదుగుదల కు ,చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు గాను ఆరోగ్య సూత్రాలు పాటించాలని సూచించారు. కుటుంబీకులు అంతా బాధ్యత గా ఆహార నియమాలు పాటించి పిల్లలు భవిష్యత్తు, గర్భిణిలు,బాలింతలు ఆరోగ్య అంశం లో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్ వైజర్ పి. శశికళ, పి శైలజ , అంగన్వాడి టీచర్లు బి రాము, వై రోజా పలువురు లబ్ధిదారులు, బాలింతలు, గర్భిణీలు తదితరులు పాల్గొన్నారు..

## శ్రీ పైడితల్లమ్మవారి గోడ పత్రికను ఆవిష్కరించిన ఎమ్మెల్యే గణబాబు





విశాఖ పశ్చిమ, పెన్ పవర్, ఏప్రిల్ 21 : స్థానిక విశాఖ పశ్చిమ, గోపాలపట్నంలో శ్రీ పైడితల్లి అమ్మవారి పండుగ మహోత్సవాలకు శుభారంభం. ప్రశాంత్ నగర్‌లో కొలువై ఉన్న శ్రీ పైడితల్లి అమ్మవారి పండుగ మహోత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లు వేగంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త మరియు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గణబాబు ఆధ్వర్యంలో వారి నివాసంలో గోడపత్రిక ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలగా అమ్మవారి పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నామని, ఈ సంవత్సరంలో కూడా అదే ఉత్సాహంతో వేడుకలు జరగనున్నాయని తెలిపారు. ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం, మే 3, 2026 ఆదివారం పుట్ట బంగారం తీయుట కార్యక్రమం,

మే 4 సోమవారం తోలేళ్ళు సంబరాలు,

మే 5 మంగళవారం ప్రధాన పండుగ మహోత్సవంగా నిర్ణయించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బుద్ధ శివాజీ, గంద్రేడి పెదబాబు, చందన గాంధి, నరిపిన్ని సత్తిరాజు, మూర్తి పట్నాయక్, దాడి రమేష్ నాయుడు, బొడ్డేటి విజయ్, రాజశేఖర్, దొడ్డి చంద్రశేఖర్, పెప్సీ రమణ అయతంశెట్టి గోపీ, దాడి సురేష్, కుమార్, కొల్లి అప్పారావు తదితరులు పాల్గొన్నారు. ఆలయ అర్చకులు మరియు ఇతర కమిటీ సభ్యులు కూడా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ఈ సందర్భంగా గోపాలపట్నం ప్రాంతంలో పండుగ వాతావరణం నెలకొని, భక్తుల్లో ఉత్సాహం వెల్లివిరుస్తోంది.

## విశాఖలో ప్రభుత్వ భూమిపై కబ్జా ఆరోపణలు

- వెంటనే చర్యలు తీసుకోవాలంటూ వైసీపీ డిమాండ్





విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఏప్రిల్ 21 :నగరంలో ప్రభుత్వ భూములపై పెరుగుతున్న అక్రమ కబ్జాలు తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నా యని వైసీపీ నాయకులు పేర్కొన్నారు. విశాఖ తూర్పు నియోజకవర్గంలోని జోడుగుళ్లపాలెం ప్రాంతంలో, వైఎస్ఆర్ విగ్రహం ఎదురుగా ఉన్న తుపాన్ బాధితుల భవనం సమీపంలో సుమా రు రూ.150 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తు న్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఈ ఘటనపై స్థానిక ప్రజలు చేపట్టిన నిరసన కార్యక్రమానికి మద్దతుగా విశాఖపట్నం జిల్లా పార్టీ అధ్యక్షుడు కె.కె. రాజు, తూర్పు నియో జకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు తది తరులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

ఈ సందర్భంగా కె.కె. రాజు మాట్లాడుతూ, జోడుగుళ్లపాలెం ప్రాంతంలో సుమారు 84 నుండి 71 సెంట్ల వరకు విస్తరించిన ప్రభుత్వ భూమిపై అక్రమంగా హక్కులు కల్పించే ప్రయ త్నాలు జరుగుతున్నాయని తెలిపారు. గతంలో ఎన్నికల పోలింగ్ కేంద్రాలుగా ఉపయోగించిన ఈ భూమిని ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టేందుకు నకిలీ పత్రాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు.

ఈ వ్యవహారంలో కొంతమంది రాజకీయ నాయ కులు, ముఖ్యంగా తెలుగుదేశం పార్టీకి చెందిన స్థానిక నేతలు, కొందరు రెవెన్యూ అధికారులు కలిసి పనిచేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తు న్నాయని అన్నారు. ప్రభుత్వ ఆస్తులను రక్షిం చాల్సిన బాధ్యత కలిగిన అధికారులు నిర్లక్ష్యం గా వ్యవహరిస్తుండటంపై ప్రజలు తీవ్ర అసంతృ ప్తి వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.ప్రభుత్వ భూ ములపై జరుగుతున్న అక్రమ నిర్మాణాలను వెంటనే నిలిపివేసి, ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. నకిలీ పత్రాల ఆధారంగా భూములను కబ్జా చేసే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, భూమిని తిరిగి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్‌లను కోరారు.

ఈ కార్యక్రమంలో కోరుకుండ స్వాతి, ఉమ్మడి దాస్, పళ్ళ దుర్గ, పేర్ల విజయచంద్ర, అంబటి శైలేష్, యం. సునీల్, సనపల రవీంద్రభరత్, రామన్న పాత్రుడు, ఈశ్వర్, హరికృష్ణ, సాగర్, రిసు అనురాధ, చోళగి నాగేశ్వరరావు, ఉమ్మడి కళ్యాణ్, నీలి రెడ్డి తదితరులు, గ్రామ ప్రజలు మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## పలాసలో వీఓఏలకు మొబైల్ ఫోన్ల పంపిణీ చేసిన ఎమ్మెల్యే గౌతు శిరీష...





పలాస, పెన్ పవర్ : ఏప్రిల్ 21..పలాస నియోజకవర్గ పరిధిలోని గ్రామ సంఘాల సహాయకులు విధి నిర్వహణను మరింత సులభతరం చేసేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా మంగళవారం పలాసలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీష ముఖ్యఅతిథిగా పాల్గొని,142 వీఓఏలకు ఉచితంగా మొబైల్ ఫోన్లను పంపిణీ చేశారు.

పొదుపు సంఘాల లావాదేవీలు, రికార్డుల నిర్వహణను ఆన్‌లైన్ ద్వారా వేగవంతం చేసేందుకు ఈ స్మార్ట్‌ఫోన్లు ఎంతగానో ఉపయోగపడతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. డిజిటల్ విధానం ద్వారా మహిళా సంఘాల పనితీరులో మరింత పారదర్శకత వస్తుందని ఆమె అభిప్రాయపడ్డారు.

గ్రామీణ ప్రాంతాల్లోని మహిళా సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, వీఓఏలు సాంకేతికతను అందిపుచ్చుకుని బాధ్యతాయుతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

“మహిళా సంఘాల ఆర్థిక పురోగతికి వీఓఏలు వెన్నెముక వంటి వారు. వారికి ఆధునిక పరికరాలు అందించడం ద్వారా క్షేత్రస్థాయిలో పనితీరు మెరుగుపడుతుంది.”

--- గౌతు శిరీష, ఎమ్మెల్యే

ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు పి విఠల్ రావు, మల్లా శ్రీనివాసరావు, మూడు మండలాలు మండల సమాఖ్య అధికారులు ఎపియంలు జి వరప్రసాద్, పి కూర్మారావు , కె జంబావతి మరియు పెద్ద సంఖ్యలో వీఓఏలు పాల్గొన్నారు. తమ పనికి అవసరమైన ఫోన్లను అందించినందుకు వీఓఏలు ఈ సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు.

# గీతం భూ బదలాయింపుపై వివాదం



22న ముట్టడికి వైసీపీ యూత్ పిలుపు

విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఏప్రిల్ 21 :యువజన విభాగం గీతం యూనివర్సిటీ భూ వ్యవహారంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ ఈ నెల 22న ముట్టడి కార్యక్రమానికి పిలుపునిచ్చిం ది. ఈ మేరకు దక్షిణ నియోజకవర్గ సమన్వయ కర్త వాసుపల్లి గణేష్ కుమార్ వెల్లడించారు.

స్థానిక ఆసిల్‌మెట్టలో నిర్వహించిన యూత్ విం గ్ సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కు సంబంధించిన భూముల అంశం ఇటీవల తీవ్ర చర్చనీయాంశంగా మారిం దన్నారు. రుషికొండ, ఎండాడ ప్రాంతాల్లో సు మారు 54.79 ఎకరాల ప్రభుత్వ భూమిని గీతం యాజమాన్యానికి బదలాయించే ప్రతిపాదనను కౌన్సిల్ ఆమోదించడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు.జనవరి 30న జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఈ ప్రతిపాదనకు వ్యతిరేకంగా వైసీపీ కార్పొరేటర్లు నిరసన వ్యక్తం చేసినప్పటికీ, ఇతర పార్టీల మద్దతుతో తీర్మానం ఆమోదించా రని విమర్శించారు. విశాఖ నగరంలోని విలు వైన ప్రభుత్వ భూములను ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు కుట్ర జరుగుతోందని ఆరోపిం చారు.ఈ భూముల విలువ వేల కోట్ల రూపా యలుగా ఉండొచ్చని పేర్కొంటూ, ప్రజావసరాల కోసం వినియోగించాల్సిన ఆస్తులను ప్రైవేటు సంస్థలకు ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తామని స్పష్టం చేశారు. అలాగే, ఈ అంశంపై ప్రభుత్వం వైఖరిని మార్చకపోతే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ నేపథ్యంలో, 22వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు సుమారు 2000 మంది విద్యార్థులతో కలిసి గీతం యూనివర్సి టీని ముట్టడిస్తామని ప్రకటించారు.

ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర, జిల్లా, నియోజక వర్గ నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధు లు పాల్గొననున్నట్లు తెలిపారు.

## గ్రామ సచివాలయాన్ని ప్రారంభోత్సవం చేసిన ప్రభుత్వ విప్.



గుమ్మలక్ష్మీపురం ఏప్రిల్ 21 పెన్ పవర్.ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత వేగంగా,పరదర్శకంగా సేవలు అందించేందుకు గ్రామ సచివాలయాలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు.

గుమ్మలక్ష్మీపురం మండలం నెల్లికిక్కువ పంచాయితీ పరిధిలోగల గ్రామ సచివాలయాన్ని మంగళవారం నాడు కురుపాం నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి ముఖ్యఅతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి సచివాలయాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.గ్రామ సచివాలయాలు ప్రజలకు అందుబాటులో ఉంటూ వేగంగా పారదర్శకంగా అందించేందుకు కీలకపాత్ర పోషిస్తాయి అన్నారు.ప్రతి పౌరుడికి ప్రభుత్వ పథకాలు సులభంగా చేరేలా అధికారులు కృషి చేయాలని సచివాలయ సిబ్బందికి ఆమె సూచించారు ఈ కార్యక్రమంలో ఉమ్మడి విజయనగరం జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్మన్ దొంకాడ రామకృష్ణ,ఏఎంసీ చైర్పర్సన్ కద్రుక కళావతి,రాష్ట్ర కార్యదర్శి విధిగా పద్మావతి,మండల పార్టీ అధ్యక్షులు అడ్డాకుల నరేష్,బిజెపి కన్వీనర్ కట్టర్ అప్పలస్వామి,మాజీ కన్వీనర్ పాడి సుదర్శన్ రావు,ఎంపీడీవో శ్రీనివాసరావు,తాసిల్దార్ ఎన్.శేఖరం.గ్రామ సచివాలయం సిబ్బంది కూటమి నాయకులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## రింతాడలో విలేజ్ హెల్త్ శానిటేషన్ అండ్ న్యూట్రిషన్ కమిటీ సమావేశం



గూడెం కొత్తవీధి,పెన్ పవర్,ఏప్రిల్ 21:రింతాడ గ్రామ పంచాయతీ–1లో విలేజ్ హెల్త్ శానిటేషన్ అండ్ న్యూట్రిషన్ కమిటీ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆల్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఆధ్వర్యంలో ఈక్విప్ ప్రాజెక్ట్ ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ వై.ఎస్. కుసుమ మార్గదర్శకత్వంలో చేపట్టారు. సమావేశంలో గ్రామ పంచాయతీ స్థాయిలో ఉన్న ఆరోగ్య సమస్యలు, పారిశుధ్యం, పోషకాహార లోపాలపై సమగ్రంగా చర్చించారు. వీటిని ఎలా తగ్గించాలి, అధిగమించాలి అనే అంశాలపై విశ్లేషణ చేశారు. అలాగే పన్నెండు సమగ్ర ప్రాథమిక ఆరోగ్య సేవలపై ప్రజలకు అవగాహన కల్పించారు.గ్రామాల్లో మలేరియా, డెంగ్యూ, క్షయ వ్యాధి వంటి వ్యాధులను ముందుగానే గుర్తించి, బాధితులకు సకాలంలో వైద్యం అందించాల్సిన అవసరాన్ని సూచించారు. శిశు, మాతృ మరణాలను నివారించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. తీవ్రమైన పోషకాహార లోపం, మోస్తరు పోషకాహార లోపం ఉన్న పిల్లలను గుర్తించి, అవసరమైతే పోషకాహార పునరుద్ధరణ కేంద్రాలకు పంపించాలని సూచించారు.ఎయిమ్స్ బృందం ఆశ కార్యకర్తలకు ప్రత్యేక అవగాహన కల్పించింది. ప్రతి రోజు గ్రామ సందర్శనలు నిర్వహించి ప్రజల ఆరోగ్య పరిస్థితులను పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామ ప్రజల్లో ఆరోగ్య అవగాహన పెంపొందించడంతో పాటు పరిశుభ్రత, పోషకాహారంపై చైతన్యం కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో జగదీష్, గ్రామ కార్యదర్శి అరుణ్ కుమార్, ఎయిమ్స్ బృంద సభ్యులు రాజు, తేజ, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ నిర్మల, హెల్త్ అసిస్టెంట్ ఎం. సత్యనారాయణ, ఏఎన్ఎంలు యోగిత, పద్మ, ఆశ కార్యకర్తలు, అంగన్వాడీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## చీపురుపల్లి పంచాయతీకి ఐ ఎస్ ఓ ధ్రువీకరణ పత్రం..



చీపురుపల్లి పెన్ పవర్ ఏప్రిల్ 21 : చీపురుపల్లి గ్రామపంచాయతీని కేరళ స్థానిక పరిపాలన సంస్థ వారు మంగళవారం నాడు సందర్శించి పంచాయతీ పరిపాలనలో పెన్షన్ పంపిణీ కార్యాలయం పనితీరు ప్రజలకు అందించే సేవలపై తనిఖీ చేశారు. గ్రామపంచాయతీలో పారిశుధ్యము, తాగునీరు సరఫరా, వీధిలైట్లు నిర్వహణ, సమర్థవంతంగా జరుపుచున్నారని ఐఎస్ఓ–9001–2015 ధ్రువీకరణ పత్రమును అత్యంత సంతృప్తితో అందజేశారు. విజయనగరం జిల్లాలో అత్యుత్తమ గ్రీనరీ మరియు ఆహ్లాదకర వాతావరణంలో ఉన్న గ్రామ పంచాయతీగా గుర్తించి సర్టిఫికెట్ అందించారు. ఈ కార్యక్రమంలో కేరళ రాష్ట్రానికి చెందిన స్థానిక పరిపాలన వ్యవహారాల సంస్థ డిప్యూటీ డైరెక్టర్ సుకుమారుడు , రాష్ట్ర పంచాయతీ కార్యాలయం అధికారి ఇమామ్ గ ఆధ్వర్యంలో చీపురుపల్లి మేజర్ పంచాయతీ ప్రత్యేక అధికారి శ్రీ ఐ సురేష్ కి ఐఎస్ఓ–9001–2015 ధ్రువీకరణ పత్రము అందజేశారు. ఈ కార్యక్రమంలో చీపురుపల్లి కార్యదర్శి వై ఝాన్సీ రాణి, జూనియర్ సహాయకులు ఎన్ రామ్మోహన్రావు, ఎస్ ఈశ్వరరావు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు..

# సి హెచ్ సి లో సరిపడ వైద్యులను నియమించాలి

- నిత్యం రోగులతో కిటకిటలాడుతున్న సామాజిక ఆరోగ్య కేంద్రం.
- వాట్సాప్ ద్వారా జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవో లకు ఫిర్యాదు.
- సిపిఎం మండల కార్యదర్శి కొర్రా త్రినాధ్.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఏప్రిల్ 21.** మండల కేంద్రంలో గల సామాజిక ఆరోగ్య కేంద్రంలో సరిపడ్డ వైద్యులను నియమించాలని మండల సిపిఎం పార్టీ కార్యదర్శి కొర్ర త్రినాథ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం త్రినాధ్ మాట్లాడుతూ.. వాతావరణంలో వచ్చిన మార్పు రీత్యా జ్వర బాధితులు రోజురోజుకు పెరుగుతున్నారని, వైద్యం కోసం ఉదయం 9 గంటల నుండి మారుమూల గ్రామాల నుండి రోగులు సిహెచ్సీ వచ్చి లైన్లో నిలిచి గంటల తరబడి నిరీక్షించవలసి వస్తుందన్నారు. .ఇద్దరు వైద్య అధికారులలో ఒకరు సెలవులో ఉండగా ఒకే వైద్య అధికారి గ్రౌండ్స్ వెళ్ళి రోగులను పరిశీలన చేసి కొత్త గా వస్తున్న రోగులకు వైద్య పరీక్షలుచేయటం సాధ్యం కాదు, అయినచేసేది లేక రోగులు వైద్యం పొందాలని ఆశతో ఎంతసేపు అయినా అలానే క్యూ లైన్ లో నిలబడవలసిన పరిస్థితి నెలకొందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ప్రతి వారం అధికారులు,ప్రజా ప్రతినిధులు సందర్శించిన సమస్య పరిష్కారం శూన్యం,అందుకు ప్రభుత్వం స్పందించి సామాజిక ఆరోగ్య కేంద్రానికి సరిపడా వైద్య అధికారులు వైద్య సిబ్బంది నియమించాలనిఅలాగే ఆసుపత్రిలోఅన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలనిఆయన డిమాండ్ చేశారు. రామోజీగా ఆరోగ్య కేంద్రంలో వైద్య అధికారులు వైద్య సిబ్బంది నియమించి సమస్య పరిష్కారం చేయాలని లేని పక్షాన రోగులతో సిహెచ్సీ ముందు టెంట్ వేసి ఆందోళన చేస్తామని హెచ్చరిస్తున్నాంఅని అన్నారు.ఎన్నో ప్రభుత్వాలు మారుతున్నప్పటికీ సామాజిక ఆరోగ్య కేంద్రంలో పూర్తిస్థాయి వైద్యాధికారులు నియమించకపోవడంతో



మారుమూల ముంచం కుటుంబ 23 పంచాయితీ ప్రజలు అనారోగ్యాల బారిన పడితే సరైన వైద్య మందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన అన్నారు. తక్షణమే రాష్ట్ర కూటమి ప్రభుత్వం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారుల స్పందించి సిహెచ్సి లో సరిపడా వైద్య అధికారులు వైద్య సిబ్బంది నియమించాలని ఆయన డిమాండ్ చేశారు.




## నర్సీపట్నంలో 5జీ స్మార్ట్ ఫోన్ల పంపిణీ



**నర్సీపట్నం, పెన్ పవర్ (ఏప్రిల్ 21) :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా వి.ఓ.ఏ లకు అందిస్తున్న 5జీ స్మార్ట్ సెల్ ఫోన్ల పంపిణీ కార్యక్రమం మంగళవారం నర్సీపట్నం మండల కార్యాలయంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా తాండవ రిజర్వాయర్ ప్రాజెక్ట్ చైర్మన్ కరక సత్యన్నారాయణ, మాజీ జడ్పీటీసీ సుకల రమణమ్మ, జిల్లా అధికార ప్రతినిధి లాలం శ్రీరంగస్వామి, జనసేన నియోజకవర్గ ఇంచార్జ్ సూర్యచంద్ర హాజరయ్యారు.

?ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మహిళా పొదుపు సంఘాల బలోపేతానికి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వేగంగా చేరవేయడానికి ఈ ఆధునిక సాంకేతికత ఎంతో అవసరమని పేర్కొన్నారు. ముఖ్యంగా ఈ స్మార్ట్ ఫోన్ల ద్వారా స్వయం సహాయక సంఘాల లావాదేవీలను ఎప్పటికప్పుడు ఆన్లైన్లో నమోదు చేయడానికి వీలుంటుందని, తద్వారా పారదర్శకత పెరుగుతుందని తెలిపారు. అలాగే క్షేత్రస్థాయిలో ప్రభుత్వానికి, సంఘాలకు మధ్య సమాచార మార్పిడి వేగవంతం అవుతుందని వివరించారు.

?ఈ పంపిణీ కార్యక్రమంలో భాగంగా నర్సీపట్నం, గొలుగొండ, నాతవరం, మాకవరపాలెం మండలాలకు చెందిన మొత్తం 169 మంది వి.ఓ.ఏలకు ఆయా మండల నాయకులు చేత 5జీ స్మార్ట్ ఫోన్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల టీడీపీ అధ్యక్షులు, ఇతర ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు మరియు లబ్ధిదారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. నూతన ఫోన్లను అందుకున్న వి.ఓ.ఏలు తమ విధి నిర్వహణలో ఇవి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని ఆనందం వ్యక్తం చేశారు.

## నర్సీపట్నంలో శ్రీశంకరాచార్య స్వామి వారి రథయాత్ర



**నర్సీపట్నం, పెన్ పవర్ ( ఏప్రెల్ 21) :** స్థానిక వైదిక బ్రాహ్మణ, పురోహిత మరియు అర్చక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదిశంకరాచార్యుల జయంతి మహోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం సాయంత్రం శ్రీశంకరాచార్య స్వామి వారి రథయాత్ర కన్నుల పండువగా నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సతీమణి పద్మావతి ముఖ్య అతిథిగా విచ్చేసి, జ్యోతి ప్రజ్వలన చేసి రథయాత్రను ప్రారంభించారు. ఐదు రోడ్ల జంక్షన్లోని శ్రీ బాల వినాయక స్వామి దేవాలయం వద్ద ప్రారంభమైన ఈ ఊరేగింపులో స్వామి వారి చిత్రపటాన్ని శోభాయమానంగా అలంకరించిన రథంపై ఉంచి పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ రకాల సాంస్కృతిక ప్రదర్శనలు, వేద మంత్రోచ్ఛారణలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ సమాజానికి ఆదిశంకరాచార్యులు అందించిన అద్వైత సిద్ధాంతం, ధర్మ ప్రచారం ఎంతో స్ఫూర్తిదాయకమని కొనియాడారు. బ్రాహ్మణ, పురోహిత సంఘం వారు ఇటువంటి సేవా, ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పార్టీ నాయకులు, వైదిక బ్రాహ్మణ పురోహిత ఢ అర్చక సంక్షేమ సంఘం ప్రతినిధులు, సభ్యులు మరియు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక భావనతోనే మానసిక ప్రశాంతత

సినీ నటుడు మహర్షి రమణకు ఘన సత్కారం

**గూడెం కొత్త వీధి,పెన్ పవర్,ఏప్రిల్ 21:** కాకినాడ జిల్లా కోటనందూరు ప్రాంతానికి చెందిన సినీ, టీవీ నటుడు మహర్షి రమణను మండలంలోని గూడెం కాలనీ నాగదేవత సేవా కమిటీ సభ్యులు మంగళవారం ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక భావజాలం ద్వారా మానసిక ప్రశాంతతతో పాటు సామాజిక అభివృద్ధి కూడా సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ప్రకృతి సమతుల్యతను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించి ముందుకు సాగాలని సూచించారు. ఏజెన్సీ గ్రామాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తూ గిరిజనుల్లో చైతన్యం తీసుకువస్తున్న నాగదేవత సేవా సంఘం సేవలను ఆయన ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి రమణబాబు, జిల్లా పరిషత్ ఉద్యోగుల సంఘ ప్రతినిధి రీమల నాగరాజు, దుమంతి సత్యనారాయణ, అల్లూరి సీతారామరాజు గిరిజన సంక్షేమ సంఘం అధ్యక్షురాలు శ్యామల వరలక్ష్మి, కోటనందూరు మండల ఐక్య ఉపాధ్యాయ పరిషత్ (యుటిఎఫ్) అధ్యక్షుడు దాడి గోవిందరావు, శ్రీ అల్లూరి సీతారామరాజు సేవా కమిటీ అధ్యక్షుడు లక్కాకుల బాబ్జి, రీమల కుమారి, పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



## భవానిపట్నం - విశాఖ ట్రైయిన్ లో కార్డన్ అండ్ సెర్చ్



**విజయనగరం టౌన్, పెన్ పవర్, ఏప్రిల్ 21:** విజయనగరం జిల్లాలో గంజాయి, మద్యం, ప్రేలుడు సామగ్రి, డ్రగ్స్, గుట్కాలు, మాదక ద్రవ్యాల అక్రమ రవాణ నియంత్రణకు మరియు అనుమానస్పద వ్యక్తులను గుర్తించి, వారిని అదుపులోకి తీసుకొనేందుకు ఒడిస్సా రాష్ట్రం భవానీ పట్నం నుండి విశాఖపట్నం ప్రయాణికులతో రద్దీగా వెళ్లే ట్రైన్ ను లక్ష్యంగా చేసుకొని ఏప్రిల్ 21న ఆకస్మికంగా 'కార్డన్ అండ్ సెర్చ్' నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ మాట్లాడుతూ జిల్లాలో మద్యం, గంజాయి, మందుగుండు, ప్రేలుడు, డ్రగ్స్, గుట్కాల అక్రమ రవాణ నియంత్రణకు, అనుమానస్పద వ్యక్తులను అదుపులోకి తీసుకొనే లక్ష్యంతో ఒడిస్సా భవానీపట్నం నుండి విశాఖపట్నం వెళ్ళే ట్రెయిన్ లో 'కార్డన్ అండ్ సెర్చ్' నిర్వహించినట్లుగా ఎస్పీ తెలిపారు. బొబ్బిలి రైల్వే స్టేషను నుండి విజయనగరం రైల్వే స్టేషను వరకు పోలీసు అధికారులు, సిబ్బంది ట్రెయిన్ లోని అన్ని కంపార్టుమెంట్లును క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టి, ప్రయాణికుల బ్యాగులు, వస్తువులను బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ సహాయంతో పరిశీలించారు. బొబ్బిలి రైల్వే స్టేషనులో భవానీపట్నం విశాఖపట్నం వెళ్ళే ట్రైను లక్ష్యంగా చేసుకొని పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారన్నారు. తనిఖీల్లో ట్రైన్ లో ప్రయాణించే పాసింజర్స్ కు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా పోలీసు అధికారులు, సిబ్బంది బృందాలుగా ఏర్పడి, ఒక్కొక్క కంపార్టుమెంటును పోలీసు అధికారుల ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది, డాగ్, బాంబ్ స్క్వాడ్స్ తో తనిఖీలు చేపట్టామన్నారు. ఈ తనిఖీలు చేపట్టే సమయంలో ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ట్రైను బొబ్బిలి రైల్వే స్టేషనులో నిలిపివేయకుండా, ట్రైన్ లో పోలీసు అధికారులు, సిబ్బంది విజయనగరం వచ్చేంత వరకు ప్రయాణించి, ప్రయాణికుల బ్యాగులు, లగేజ్ లను క్షుణ్ణంగా తనిఖీలు చేసామన్నారు. ఈ తనిఖీల్లో ఈగల్, ఆర్పీఎఫ్, జిఆర్పీఎఫ్, సివిల్, ఎస్టీఎఫ్, బాంబ్ డిస్పోజల్ టీమ్స్, డాగ్ స్క్వాడ్స్ కూడా పాల్గొన్నాయి.



## నిరుపేదలకు ధాన్యం వితరణ

## ఉపాధ్యాయుడు పాడి కృష్ణ సేవలకు ప్రశంసలు



**స్టాప్ రిపోర్టర్,చింతపల్లి /గూడెం కొత్త వీధి, పెన్ పవర్, ఏప్రిల్ 21:** గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేదల కష్టాలను అర్థం చేసుకుని వారికి సహాయం చేయడం ద్వారా ఉపాధ్యాయుడు పాడి కృష్ణ ఆదర్శంగా నిలుస్తున్నారు. పంటలు విఫలమై జీవనోపాధి కష్టంగా మారిన కుటుంబాలను గుర్తించి, వారికి ధాన్యం బస్తాలను పంపిణీ చేయడం ద్వారా ఆయన మనసున్న మనిషిగా నిలిచారు.ఒక కుటుంబంలో ఎక్కువ మంది పిల్లలు ఉండి, ఆ సంవత్సరం పంటలు పండక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితిని గమనించిన కృష్ణ, కొన్ని గ్రామాల్లోని అలాంటి నిరుపేద కుటుంబాలను గుర్తించారు. వారికి రెండు కుటుంబాలకు ఒక ధాన్యం బస్తా చొప్పున పంపిణీ చేశారు. ఈ ధాన్యం బస్తాలు ఆయన సొంతంగా పండించిన నెల్లూరు సన్నాల బియ్యంతో అందించటం విశేషం.సేవా భావం ఆయనలో నాటుకుపోయిన లక్షణంగా కనిపిస్తోంది. ప్రతి సంవత్సరం పండగల సందర్భంలో అవసరమైన వారికి బట్టలు పంపిణీ చేయడం ఆయనకు ఆనవాయితీ. ఇంట్లో పండే ప్రతి పంటలో కొంత భాగాన్ని నిరుపేదలకు దానం చేయడం అలవాటుగా మార్చుకున్నారు. అదనంగా, ఆడించిన పొలం ద్వారా వచ్చిన బియ్యాన్ని కూడా పంచిపెడుతూ సహాయహస్తం చాచి నిలుస్తున్నారు.యువతపై కూడా ఆయన ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. వేసవి సెలవుల్లో పిల్లలు, యువత ఆటలు ఆడుకునేందుకు అవసరమైన ఆట వస్తువులను అందజేస్తూ వారిలో ఉత్సాహాన్ని పెంచుతున్నారు. అంతేకాకుండా, తన సంపాదనలో కొంత భాగాన్ని నిరుపేదలకు ఆర్థిక సహాయంగా కేటాయిస్తూ మానవత్వాన్ని చాటుతున్నారు.పాడి కృష్ణ చేస్తున్న సేవా కార్యక్రమాలు సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయి. ఆయన సేవలను పలువురు అభినందిస్తూ, మరింత మందికి స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షిస్తున్నారు.

## ఆదివాసీలకు ఉచిత సౌర విద్యుత్...

## గ్రామాల్లో 'సూర్య ఘర్' యూనిట్ల ఏర్పాటు వేగవంతం



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, ఏప్రిల్ 21:** మండలంలోని గిరిజన గ్రామాల్లో 'పీఎం సూర్య ఘర్' పథకం కింద సౌర విద్యుత్ యూనిట్ల ఏర్పాటు వేగంగా కొనసాగుతోంది. దేశవ్యాప్తంగా కోటి ఇళ్లకు ఉచిత విద్యుత్ అందించాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకం, మన్యం ప్రాంతంలో విశేష స్పందన పొందుతోంది.ఈ పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు వందశాతం సబ్సిడీతో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేస్తున్నారు. ఇతర రాష్ట్రాల్లో లేని విధంగా ఆంధ్రప్రదేశ్లో కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా గిరిజన కుటుంబాలకు ఈ సౌకర్యాన్ని అందిస్తోంది. ప్రస్తుతం జీకే వీధి మండలంలోని పలు పంచాయతీల్లో సూర్య ఘర్ యూనిట్ల ఏర్పాటు పనులు కొనసాగుతున్నాయి.ఈ పథకం కింద 2 నుండి 3 కిలోవాట్ల సామర్థ్యంతో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయడం ద్వారా నెలకు సుమారు 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పొందే అవకాశం ఉంది. దీని వల్ల విద్యుత్ బిల్లుల భారం గణనీయంగా తగ్గనుంది. అదనంగా, అవసరానికి మించి ఉత్పత్తి అయ్యే విద్యుత్ను ప్రభుత్వం కొనుగోలు చేయడంతో లబ్ధిదారులకు అదనపు ఆదాయం కూడా లభించనుంది. ఈ పథకం గిరిజన ప్రజల జీవితాల్లో వెలుగులు నింపడంతో పాటు విద్యుత్ స్వయం సమృద్ధికి దోహదం చేస్తుందని అధికారులు తెలిపారు. మన్యం ప్రాంత గ్రామాల్లో పనులు ప్రారంభం కావడంతో గిరిజనుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏపీఈపీడీసీఎల్ చింతపల్లి అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రభాకర్ సూచించారు.

# సుదీక్ష విద్యాసంస్థ విద్యార్థులు అద్భుత ప్రతిభ

**గాజువాక :పెన్ పవర్, ఏప్రిల్ 21:** ఆల్ ఇండియా జెఈఈ మెయిన్స్ లో కూర్మన్నపాలెం సుదీక్ష విద్యార్థిని, విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. 20 మందికి పైగా విద్యార్థులు 90 పర్సంటేల్ పైగా సాధించారు. కళాశాల ఫౌండర్ అండ్ చైర్మన్ అప్పలనాయుడు చేతుల మీదగా ప్రతిభ సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు జ్ఞాపకలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆల్ ఇండియా మెయిన్స్ లో సుదీక్ష విద్యార్థి శామ్యూల్ మన్నారెడ్డి 210 ర్యాంక్ సాధించడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. 20 మందికి పైగా విద్యార్థిని, విద్యార్థులు 90 పర్సంటేల్ పైగా సాధించి సుదీక్ష సత్తా చాటారని అన్నారు. కూర్మన్నపాలెం ప్రాంతం తో పాటు చుట్టు పక్కల ఉన్న అన్ని ప్రాంతాల నుంచి సుదీక్షలో చేర్పించి మాకు అండగా నిలబడిన ప్రతి ఒక్క తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం తల్లిదండ్రులు మాట్లాడుతూ మా పిల్లలకు అద్భుతమైన పర్సంటేల్ వచ్చేలాగా కృషి చేసిన సుదీక్ష యాజమాన్యానికి, ఉపాధ్యాయులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం రామశంకర్, ప్రిన్సిపల్ సుధారాణి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




## బాల్య వివాహం చట్టరీత్యా నేరం: రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు డా. పి. నాగ మానస

అక్షయ తృతీయ సందర్భంగా బాల్య వివాహ నిర్మూలనపై అవగాహన కార్యక్రమం



**పాడేరు ,పెన్ పవర్, ఏప్రిల్ 21:** బాల్య వివాహం ఒక సాంఘిక దురాచారమని, చట్టరీత్యా నేరమని, దీని వల్ల బాలికలకు అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు డా. పి. నాగ మానస స్పష్టం చేశారు.

అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలం డి. చింతలవీధి గ్రామంలో అక్షయ తృతీయను పురస్కరించుకుని మంగళవారం బాల్య వివాహ నిర్మూలన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డా. నాగ మానస గ్రామస్తులతో మాట్లాడుతూ, తల్లిదండ్రులు పిల్లలకు బాల్య వివాహాలు చేయడం, ప్రోత్సహించడం చట్టపరంగా శిక్షార్హమని హెచ్చరించారు. బాల్య వివాహాల వల్ల బాలికలు శారీరకంగా, మానసికంగా తీవ్రంగా నష్టపోతారని, చదువుకు దూరమవుతారని వివరించారు.

ప్రతి అమ్మాయి చైల్డ్ హెల్ప్ లైన్ టోల్ ఫ్రీ నంబర్ 1098 గురించి అవగాహన కలిగి ఉండాలని, బాల్య వివాహం లాంటి ఏదైనా సమస్య ఎదురైనప్పుడు వెంటనే 1098కు కాల్ చేసి సమాచారం అందించాలని సూచించారు. గ్రామాల్లో ప్రజలంతా బాధ్యతగా వ్యవహరించి బాల్య వివాహాలను అరికట్టాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో అల్లూరి సీతారామరాజు జిల్లా శిశు సంక్షేమ మరియు మహిళా అభివృద్ధి ప్రాజెక్టు అధికారిణి శ్రీమతి చిట్టాపులి ఝాన్సీరాణి, జిల్లా బాలల సంరక్షణ అధికారి డా. టి. సద్దు, సీడీపీఓ జి. సువర్ణమ్మ, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామ ప్రజలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## నీటి ప్రమాదాల నివారణకు అధికారుల చర్యలు




**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, ఏప్రిల్ 21:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలంలోని నీలవరం గ్రామంలో నీటి ప్రమాదాలను నివారించేందుకు అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. జీకే వీధి ప్రత్యేక అధికారి డి గిరిబాబు సారధ్యంలో గ్రామ సమీపంలోని చెరువు వద్ద ప్రమాద సూచిక బోర్డును ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. సెలవుల్లో పిల్లలు చెరువుల వద్దకు వెళ్లకుండా తల్లిదండ్రులు బాధ్యత వహించాలని అన్నారు. ఇటీవల కాలంలో పిల్లలు జలపాతాల వద్దకు ఈతకు వెళ్లి మరణించిన సంఘటనలు అనేకం ఉన్నాయని కావున అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పించారు. ప్రత్యేకంగా వర్షాకాలం సందర్భంగా చెరువులు, వాగులు నిండిపోతుండడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. ఈ నేపథ్యంలో గ్రామ ప్రజలు, ముఖ్యంగా యువతలు మరియు పిల్లలు చెరువుల వద్ద జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ పండ్రపాల్ గ్రామ పెద్దలు, యువకులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు. చెరువుల వద్ద అప్రమత్తంగా ఉండి అనవసరంగా నీటిలోకి దిగకూడదని, ప్రమాదాలను నివారించడంలో అందరూ సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## పాడి గేదేకు అరుదైన శస్త్రచికిత్స

✹ మండల పశు వైద్యాధికారి ప్రదీప్ కుమార్ లావేటి.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఏప్రిల్ 21.** మండలంలో గల కించాయిపుట్టు పంచాయతీ, కుమిడిపుట్టు గ్రామం, పెట్టియా సీతారం అనే రైతుకు చెందిన ఓ పాడి గేదే కాలువలో పడి తలభాగాన బలంగా, లోతైన గాయమైంది. దీంతో సమాచారం అందుకున్న మండల పశు వైద్యాధికారి ప్రదీప్ కుమార్ లావేటి కుమిడిపుట్టు గ్రామం చేరుకొని సోమవారం గేదెను గాయపడిన తల భాగాన శస్త్ర చికిత్స చేసి గేదెను రక్షించారు. పశు వైద్య సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. గేదె తల అంతర్భాగాన 10 కుట్లు, పై భాగాన 12 కుట్లు వేసి గేదెను రక్షించారు. గేదె తల భాగంలోని (వెంట్రల్ ప్రాంతం)లో తీవ్రమైన లోతైన లేసరేటెడ్ గాయం అయిందని, క్లినికల్ పరీక్షలో గాయం లోతుగా ఉండి, అసమాన అంచులతో ఉండటం వల్ల ఇది ట్రామాటిక్ మూలం అని సూచిస్తుందని వైద్యాధికారి తెలిపారు. కఠినమైన అసెప్టిక్ పరిస్థితుల్లో పూర్తిగా శుభ్రపరిచి డెబ్రైడ్ చేసి అన్ని మలినాలు మరియు మృత కణజాలాన్ని జాగ్రత్తగా తొలగించమన్నారు. శస్త్రచికిత్స అనంతరం సంరక్షణలో విస్తృత స్పెక్ట్రమ్ యాంటీబయాటిక్స్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ ఔషధాలు మరియు సహాయక చికిత్స అందించమని పశువైద్య సిబ్బంది తెలిపారు.

## విశాఖలో భారీ స్థాయిలో వేసవి క్రీడా శిబిరాలు



**33 క్రీడల్లో విద్యార్థులకు శిక్షణ**

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఏప్రిల్ 21 :** నగరంలో త్వరలో భారీ స్థాయిలో వేసవి క్రీడా శిక్షణా శిబిరాలను నిర్వహించేందుకు జివిఎంసీ సన్నాహాలు ప్రారంభించింది. పాఠశాల విద్యా ర్థుల ప్రతిభను వెలికితీయడం, క్రీడలపై ఆసక్తి పెంపొందించడం లక్ష్యంగా ఈ శిబిరాలను చేపట్టనున్నట్లు అధికారులు వెల్లడించారు.

జివిఎంసీ ప్రధాన కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో అదనపు కమిషనర్ పల్లి నల్లనయ్య, పశ్చిమ నియోజకవ ర్గం ఎమ్మెల్యే మరియు ప్రభుత్వ విప్ పి.జి.వి. ఆర్ నాయుడు, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఆర్. జూన్ గాల్యోట్ రోడ్రిగ్స్, వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అద నపు కమిషనర్ మాట్లాడుతూ, స్పోర్ట్స్ అథా రిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సహకారంతో 33 రకాల క్రీడల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. అథ్లెటిక్స్ నుండి యోగా వరకు వివిధ క్రీడల్లో నిపుణుల ద్వారా శిక్షణ అందించబడుతుందని చెప్పారు. శిబిరాల నిర్వహణకు అవసరమైన మైదానాలు, శిక్షకులు, పాల్గొనే విద్యార్థుల వివరాలను త్వర గా అందించాలని క్రీడా సంఘాలకు సూచించా రు. ఎమ్మెల్యే పి.జి.వి.ఆర్ నాయుడు మాట్లాడు తూ, నగరంలోని ప్రతి వార్డు నుంచి విద్యార్థులు ఈ శిబిరాలను వినియోగించుకునే లా విస్తృత ప్రచారం చేయాలని కోరారు. క్రీడలతో పాటు యోగా, పెయింటింగ్, సాంస్కృతిక కార్యక్రమా లకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఎండ తీవ్రత దృష్ట్యా తాగునీరు, నీడ వంటి మౌలిక సదుపాయాలు తప్పనిసరిగా కల్పించా లని అధికారులను ఆదేశించారు.

జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఆర్. జూన్ గాల్యోట్ రోడ్రిగ్స్ మాట్లాడుతూ, ఈ శిబిరాల విజయవం తానికి పూర్తి సహకారం అందిస్తామని తెలిపా రు. క్రీడా సంఘాల ప్రతినిధులు కూడా నాణ్యమై న ఆహారం, పరికరాలు, సరైన మైదానాలు ఏ ర్పాటు చేయాలని కోరుతూ, రెండు రోజుల్లో అవసరమైన వివరాలు అందజేస్తామని చెప్పారు.

గత రెండేళ్లుగా శిబిరాలు నిర్వహించకపోవడం తో ఈసారి ఎక్కువమంది విద్యార్థులు పాల్గొనే అవకాశం ఉందని వారు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో జివిఎంసీ అధికారులు, సిబ్బంది, క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## జీకేవీధి మండలంలో ఈదురుగాలులతో వర్ష బీభత్సం





**గూడెం కొత్త వీధి,పెన్ పవర్,ఏప్రిల్ 21:** అల్లూరి సీతారామరాజు జిల్లా జీకేవీధి మండలంలో మంగళవారం ఈదురుగాలులతో కూడిన వర్షం బీభత్సం సృష్టించింది. మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత అధికంగా ఉండగా, ఒక్కసారిగా వాతావరణం మారి మబ్బులు కమ్ముకుని వర్షం ప్రారంభమైంది. ఈదురుగాలులతో పాటు సుమారు రెండు గంటలపాటు కుండపోతగా వర్షం కురిసింది. రింతాడ, పెదవలస, సంకాడ ప్రాంతాల్లో నిరంతరంగా వర్షం కురవడంతో జనజీవనం అస్తవ్యస్తమైంది. ఈదురుగాలుల కారణంగా సంకట సమీపంలోని జాతీయ రహదారిపై ఒక చెట్టు నేలకూలి పడింది. దీంతో ఆ మార్గంలో సుమారు గంటపాటు వాహన రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే పెదవలస మద్దెల వీధి సమీపంలో రహదారిపై మరో చెట్టు పడిపోవడంతో లక్కవరపుపేట, దేవరపల్లి, పెదవలస మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. రహదారులపై నీరు ప్రవహించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అకాలంగా కురిసిన ఈ వర్షం కారణంగా మండలంలో సాధారణ జీవనం తీవ్రంగా దెబ్బతిన్నది. అధికారులు పరిస్థితిని సమీక్షిస్తూ రహదారులపై పడిన చెట్లను తొలగించే చర్యలు చేపట్టారు.

## ప్రజలు సంతృప్తి చెందే ధ్యేయంగా వైద్య సేవలు అందించాలి : జిల్లా ఎన్.సి.డి అధికారి డాక్టర్ జగన్ మోహన్



**సాలూరు.పెన్ పవర్.ఏప్రిల్ 21:** ప్రజల సంతృప్తి స్థాయి పెంచే లక్ష్యంగా వైద్య సేవలు అందించాలని జిల్లా ఎన్.సి.డి అధికారి డాక్టర్ టి. జగన్ మోహనరావు పేర్కొన్నారు. బాగువలస, సాలూరు మెంటాడవీధి ఆరోగ్య కేంద్రాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ నిర్దేశ ఆరోగ్యకార్యక్రమాల అమలు మరియు వైద్య సేవలు అందుతున్న తీరుపై పరిశీలించారు. రోగుల ఆరోగ్య తనిఖీ వివరాలు ఈహెచ్ఆర్ నమోదు పై తెలుసుకున్నారు. ఆరోగ్య సమస్యలు స్పష్టంగా తెలుసుకొని నమోదు చేయాలన్నారు. వ్యాధి నిర్ధారణ సకాలంలో జరుపుతున్నారా లేదా అని ల్యాబ్ నివేదికల రికార్డులు తనిఖీ చేశారు. ల్యాబ్ పరికరాల పనితీరుపై పరిశీలించారు

ఆరోగ్య పర్యవేక్షకులు ప్రజారోగ్యమే లక్ష్యంగా ప్రతీ కార్యక్రమము సజావుగా సాగే విధంగా కార్యాచరణ చేస్తూ పురోగతి సాధించేలా పర్యవేక్షణ చేయాలన్నారు. పిహెచ్సీ ప్రసవాలను మెరుగు పర్చుకోవాలన్నారు. మందులు,ఓఆర్ఎస్ లభ్యతపై తనిఖీ చేశారు. ఆసుపత్రి విడిచి వెళ్ళే ముందర సేవల సంతృప్తిపై ప్రతీ ఒక్కరిని అడిగి తెలుసుకోవాలన్నారు.

పురోహితునివలస లో సంచార చికిత్సా శిబిరాన్ని తనిఖీ చేశారు. దీర్ఘకాలిక రోగుల ఆరోగ్య పర్యవేక్షణ తీరుపై తెలుసుకున్నారు. సక్రమంగా మందులు వినియోగిస్తున్నారా లేదా అని వైద్య సిబ్బంది పర్యవేక్షించాలన్నారు. గ్రామస్తులతో మాట్లాడి వైద్య సేవలు అందుతున్న తీరుపై తెలుసుకున్నారు. వేసవి జాగ్రత్తలపై ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ ఎ. ప్రియాంక, డాక్టర్ వై. మధు, ఆరోగ్య పర్యవేక్షకులు నాగేంద్ర, నాగమణి, నారాయణరావు, వైద్య సిబ్బంది ఉన్నారు.

# జేఈఈ లో అద్భుత ప్రతిభ చూపిన జీకేవీధి యువకుడు

**: ఆలిండియా స్థాయిలో 1205 ర్యాంకు సాధించిన అవగడ్డి కృష్ణ**

**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,ఏప్రిల్ 21:** జేఈఈ పరీక్షల్లో అల్లూరి జిల్లా జికేవీధి మండల కేంద్రానికి చెందిన యువకుడు అద్భుత ప్రతిభ కనబరిచారు. ఆల్ ఇండియా స్థాయిలో 1205 ర్యాంక్ సాధించిన అవగడ్డి కృష్ణ ను పలువురు అభినందిస్తున్నారు. గూడెం కొత్త వీధి గ్రామానికి చెందిన ఆవగడ్డి బుజ్జి స్థానికంగా నూడిల్స్ విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆయన కుమారుడు ఆవగడ్డి కృష్ణ విశాఖపట్నంలోని ఆదిత్య కళాశాలలో ఇంటర్ విద్యను అభ్యసిస్తున్నారు. ఇటీవల నిర్వహించిన జేఈఈ పరీక్షలకు హాజరయ్యారు. ఈ పరీక్షల్లో ఆల్ ఇండియా స్థాయిలో కృష్ణ 1205 ర్యాంక్ సాధించినట్లు కళాశాల యాజమాన్యం మంగళవారం తెలిపింది. పేదింట పుట్టిన బుజ్జి నూడుల్స్ విక్రయిస్తూ కొడుకుని మంచి చదువులు చదివించాలన్న లక్ష్యంతో ఆదిత్య కళాశాలలో చదివిస్తున్నారు. తండ్రి కష్టం తెలిసిన కృష్ణ కష్టపడి చదివి జాతీయస్థాయిలో మంచి ర్యాంకు సాధించడం తల్లిదండ్రులు బుజ్జి , రత్నం సంతోషిస్తున్నారు. జాతీయస్థాయిలో ప్రతిభ చూపిన కృష్ణను పలువురు అభినందిస్తున్నారు.



On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com